PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 280 | విజయవాడ, శనివారం 13 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Saturday 13 May 2023 | Rs

అమరావతిలో ఉద్రిక్తత

- ఆర్5 జోన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులను అడ్డుకున్న రైతులు
- పెట్రోల్ డబ్బాలతో పొక్లయినర్ల కింద పడుకుని నిరసన

2

వేతన ఒప్పందం హుళక్కే!

- స్టీల్‌ప్లాంట్‌పై మోడీ సర్కారు మరో ద్రోహం
- ఎనిమిదేళ్లుగా నూతన వేతనాలకు నోచుకోని కార్మికులు, అధికారులు
- 1982 సెయిల్ ఎంఒయుకు తూట్లు

3


భూహక్కు పత్రాలను అందజేస్తున్న సిఎం

భూ పత్రాల అప్‌గ్రేడ్

- 2,06,171 ఎకరాల చుక్కల భూములకు విముక్తి
- మరో 30 వేల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగిస్తాం
- కావలి బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ప్రతి ఎకరాకూ భూ పత్రాలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని, రైతులకు మంచి జరిగేలా చూస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 97,471 మంది రైతు కుటుంబాలకు మేలు చేసేలా 2,06,171 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ భూహక్కు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. చుక్కల భూముల మాదిరిగానే మరో 30 వేల ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగిస్తామన్నారు. వందేళ్ల క్రితం భూ సర్వే చేశారని, మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలోని 17,470 గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని, భూ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే రెండు వేల గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేసి సాగుదారులకు భూ హక్కు పత్రాలు అందజేశామన్నారు. ఈ నెల 20న మరికొన్ని పత్రాలు అందజేస్తామని తెలిపారు. చుక్కల భూములకు విముక్తి పేరుతో నెల్లూరు జిల్లా కావలిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఈ నిర్ణయం వల్ల లబ్ధిదారులకు సుమారు రూ.20 వేల కోట్లు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని తెలిపారు. తొలిసారిగా రాష్ట్రంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కొన్ని రకాల భూములు రికార్డుల్లో నమోదు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గత నాలుగేళ్లగా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరేలా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామని, ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. 'నేను మీ వాడిని. రాష్ట్రంలోని పేదల సంక్షేమం కోసం పని చేస్తున్నాను. బటన్ నొక్కి నేరుగా పేదల అకౌంట్‌లో రూ.2.10 లక్షల కోట్లను ఇప్పటి వరకు వేశాను. మీ బిడ్డగా మీకు సాయం చేస్తున్న నాకు మళ్లీ మద్దతుగా నిలవాలి. వచ్చే ఎన్నికల్లో ప్రజలు పొరపాటు చేస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేస్తారు. చంద్రబాబునాయుడు మోసపూరిత మాటలతో మీ ముందుకు వస్తున్నారు. వీటిని నమ్మవద్దు' అని అన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడు, కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి

మిగతా 2లో

నిరంకుశ జీఓ చెల్లదు

- ఇది ప్రాథమిక హక్కులకే విఘాతం
- జీఓ నెం.1ను కొట్టేస్తూ హైకోర్టు కీలక తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

నిరంకుశ పోకడలకు పోతున్న రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. రోడ్ల కూడళ్లలో బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్డు షోలను కట్టడి చేస్తూ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో తీసుకొచ్చిన వివాదాస్పద జిఓ నెంబరు 1ను రాష్ట్ర హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు ఈ జిఓ విఘాతం కలిగించేదిగా వుందని కోర్టు వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పును సిపిఎం, సిపిఐ, ఇతర ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు స్వాగతించాయి. రోడ్లపై సభలు నిర్వహించాలంటే పోలీసుల నుంచి అనుమతి కచ్చితంగా తీసుకోవాలంటూ హోంశాఖ ఈ ఏడాది జనవరి 2న జిఓ 1ను జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాసంఘాలు, న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలతో హోరెత్తించాయి. మరోవైపు ఈ జిఓను సవాల్ చేస్తూ.. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, టిడిపి నేత కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, పిసిసి అధ్యక్షులు గిడుగు వెంకటరుద్రరాజు, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. వీటిపై చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్‌ఎస్ సోమయాజులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపి శుక్రవారం ఈ కీలక తీర్పు వెలువరించింది.

ప్రతిపక్షాలు దాఖలు చేసిన పిల్స్‌ను సంక్రాంతి సెలవుల సమయంలో వెకేషన్ కోర్టులో జస్టిస్ బి దేవానంద్, జస్టిస్ కృపాసాగర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి జిఓ 1 అమలును నిలిపేస్తూ స్టే ఆదేశాలు ఇచ్చింది. పిల్‌ను రోస్టర్‌కు భిన్నంగా వెకేషన్ కోర్టు విచారణ చేపట్టి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ జరిపి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో రాష్ట్ర హైకోర్టు వ్యాజ్యాలపై సమగ్ర విచారణ పూర్తి చేసి ఈ ఏడాది జనవరి 24న తీర్పును రిజర్వులో పెట్టింది.



రోడ్లపై విపక్షాలు కార్యక్రమాలను నిర్వహించకుండా జిఓ 1ను జారీ చేశారని, ఈ జిఓను కొట్టేయకపోతే భవిష్యత్తులో ప్రతిపక్షాల నేతలు రోడ్లపై కార్యక్రమాలను నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని పిటిషనర్ల వాదనను హైకోర్టు ఆమోదించింది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించేలా జిఓ ఉందని అభిప్రాయపడింది. జిఓ 1 వల్ల ప్రజా సమస్యలపై పోరాడేందుకు వీల్లేకుండా పోతుందని ప్రజా ఉద్యమాలను అణచివేసేలా జిఓ ఉందని, ఉల్లంఘనలు జరగకుండానే అడ్డుకునేందుకు దోహదపడుతుందని పిటిషనర్ల వాదనను సమర్థించింది. సెక్షన్ 30 ప్రకారమే జిఓ 1ను జారీ చేశామని, ప్రత్యేకమైన ఆంక్షలు విధించలేదని ప్రభుత్వం చేసిన వాదన వీగిపోయింది. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఉండగా జిఓ 1 జారీ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. ఇటీవల టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కందుకూరులో నిర్వహించిన రోడ్డు మీటింగ్‌లో అమాయక ప్రజల ప్రాణాలు పోయాయని, ప్రజాహితం కోసమే జిఓ 1ను జారీ చేశామని చెప్పిన ప్రభుత్వ వాదనను తిరస్కరించింది.

బ్యానర్లు, ఫ్లెక్సీలు వంటివి కూడా ఏర్పాటు చేయడానికి వీల్లేదనే షరతు కూడా జిఓలో ఉందని ఆక్షేపించింది. పోలీస్ చట్టంలోని సెక్షన్ 30 ప్రకారం పోలీసులకు ఆదేశాలిచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్న పిటిషనర్ల వాదనను కోర్టు ఆమోదించింది. ఆ సెక్షన్ ప్రకారం నియంత్రణ అధికారం డిజిపి, జిల్లా ఎస్‌పిలకు మాత్రమే ఉంటుందని చెప్పింది. సభలు, సమావేశాలను నిర్వహించేందుకు పార్టీలకు అధికారం ఉంటుందని, వాటిని

మిగతా 7లో

ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు హర్షం

నియంతృత్వం గెలవదు



జగన్ వంటి నాయకులు వస్తారని ఊహించే.. రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించారు. అధికారం తెచ్చిన అహంకారం, నియంత ఆలోచనలు ప్రజాస్వామ్యం ముందు నిలబడవు. అంతిమంగా గెలిచేది అంబేద్కర్ రాజ్యాంగమే. జగన్ నియంతృత్వం కాదు.

– చంద్రబాబు నాయుడు, టిడిపి అధినేత

ప్రభుత్వానికి చెంపపెట్టు

జిఓ నెంబరు 1ని రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునివ్వడం హర్షణీయం. ప్రజల నిరసనలను లెక్కచేయని వైసిపి ప్రభుత్వానికి ఈ తీర్పు చెంపపెట్టు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పోకడలు విడనాడాలి. పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలి.

– వి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

ఇకనైనా నిర్బంధం మానండి

జివో 1పై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. హైకోర్టు తీర్పు వైసిపి ప్రభుత్వానికి చెంపపెట్టు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలను గౌరవించాలి. ప్రజా ఉద్యమాలపై పోలీసులను ప్రయోగించి, ఉక్కుపాదం మోపటం మానాలి.

– కె రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

రైతులతో కలిసి తిరుగుబాటు

- ధాన్యం సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలి
- దెబ్బతిన్న పంటలకు పరిహారం, బీమా అందించాలి
- తణుకు సభలో చంద్రబాబు

తణుకు సభలో ప్రసంగిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'తేమ, నూక శాతం, తూకం పేరుతో రైతుల నుంచి వసూలు చేసిన డబ్బు మొత్తం తిరిగివ్వాల్సిందేనని, లేకపోతే రైతులతో కలిసి వారం రోజుల్లో తిరుగుబాటు చేస్తామని టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు హెచ్చరించారు. రైతు సమస్యలపై చంద్రన్న పోరుబాట పేరుతో పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం నుంచి తణుకు వరకు 12 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. యాత్ర మధ్యలో పొలాల్లోకి వెళ్లి తడిచిన ధాన్యం రాశులను, కోత కోయని పంటలను, చిరిగిన గోనెసంచులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నూక పేరుతో, తూకం పేరుతో మిల్లర్లు ఏ విధంగా దోచుకుంటున్నారో రైతులు చంద్రబాబుకు వివరించారు. రైతులకు అండగా ఉంటామని, ప్రభుత్వం దిగి వచ్చే వరకూ పోరాడతామని భరోసానిస్తూ చంద్రబాబు ముందుకు సాగారు. అనంతరం తణుకు వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ అంచనాల ప్రకారం అకాల వర్షాలకు నాలుగు లక్షల ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పరిహారానికి సంబంధించి ఇప్పటివరకు ఎందుకు జిఒ విడుదల చేయలేదని ప్రశ్నించారు. రబీకి ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టారా? కడితే జిఒ చూపించాలని, బీమా కట్టకపోతే వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తడిచిన ధాన్యం తనకు చూపించడానికి తీసుకొస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్లకు తరలించడంపై మండిపడ్డారు. దెబ్బతిన్న మొక్కజొన్న, వరికి ఎకరాకు రూ. 25 వేలు, మామిడి, పొగాకు, అరటి, మిరప, పసుపు పంటలకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం ఇవ్వకపోతే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆక్వాకు యూనిట్ 1.50 రూపాయలకే కరెంట్ ఇస్తామన్నారు. భూముల సర్వే బోగస్ అని, మళ్లీ చుక్కల భూముల పేరుతో దోచుకునేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. రైతులను అవమానించిన ఎర్రిపప్ప మంత్రిని వెంటనే డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. జిఒ నంబర్ 1ని హైకోర్టు కొట్టివేయడం ప్రజాస్వామ్య విజయమన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు పీతల సుజాత, పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉభయ గోదావరి జిల్లాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

16న విశాఖలో ఎస్‌ఎల్‌బిసి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశాన్ని ఈసారి విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి (స్టేట్) భగవత్ కిషన్‌రావ్ కారద్ ఈ నెల 16న విశాఖపట్నం రానున్న నేపథ్యంలో ఎస్‌ఎల్‌బిసి సమావేశాన్ని అక్కడే నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇలా ఒక కేంద్ర మంత్రి రాక సందర్భంగా సమావేశాన్ని ప్రత్యేక ప్రాంతంలో నిర్వహించడం ఇదే తొలిసారిగా కనిపిస్తోంది.

సాధారణంగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని రాజధానిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈసారి మాత్రం కేంద్ర మంత్రి వస్తుండడంతో విశాఖలో నిర్వహిస్తూ, దానికి హాజరు కావాల్సిందిగా ఎస్‌ఎల్‌బిసి అధికారులు ముఖ్యమంత్రికి ఆహ్వానం పంపించారు. విశాఖలో నిర్వహించే సమావేశంలో బ్యాంకుల ఆర్థిక నిర్వహణ, తీసుకోవాల్సిన ఇతరత్రా చర్యలపై సమీక్షిస్తారు. అయితే విశాఖలో నిర్వహించాలన్నది కేంద్ర మంత్రి సూచనా లేక ఎస్‌ఎల్‌బిసి అధికారులు తీసుకున్న నిర్ణయమా అన్నది తెలియరాలేదు.

విద్యుదాఘాతంతో 4 ఏనుగులు మృతి

ప్రజాశక్తి- భామిని (పార్వతీపురం మన్యం జిల్లా)

చాలా కాలంగా గిరిజన గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పంటలను నాశనం చేస్తున్న ఏనుగుల గుంపులో నాలుగు ఏనుగులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. శుక్రవారం వేకువజామున పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడ-బి గ్రామ సమీపంలో గోకన్న చెరువు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒడిశా నుండి ఆరు ఏనుగుల గుంపు మన రాష్ట్రంలోకి ప్రవేశించి భామిని మండలం మనుమకొండ, పకుడి భద్ర, బొమ్మిక, కాట్రగడ-బి పరిసర ప్రాంతాలలో సంచరిస్తోంది. వీటిలో నాలుగు పెద్ద ఏనుగులు, రెండు పిల్ల ఏనుగులు ఉన్నాయి. వీటిలో మూడు పెద్ద ఏనుగులు, ఒక పిల్ల ఏనుగు కాట్రగడ-బి గ్రామ సమీపంలోని బొమ్మిక మిన్నరావు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను తాకంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి మృతదేహాలను పార్వతీపురం డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, శ్రీకాకుళం డిఎఫ్ఒ హారిక పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘటన అనుకోని విధంగా జరిగిందన్నారు. మిగిలిన రెండు ఏనుగులూ రిజర్వు ఫారెస్ట్ ఏరియాలో ఉన్నాయని, వాటిని కేర్ టేకర్స్ మానిటరింగ్ చేస్తున్నారని తెలిపారు.

పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ట్రాన్‌ఫార్మర్‌ను తాకి మృతి చెందిన ఏనుగులు

ఏనుగుల దాడిలో ఇద్దరు మృతి

- చిత్తూరు జిల్లా కుప్పంలో దారుణం

పేజీ... 5లో

గుజరాత్ సర్కారుకు సుప్రీం షాక్

- అక్రమ ప్రమోషన్లపై ఆగ్రహం
- రాహుల్‌కు శిక్ష విధించిన జడ్జీ సహా 68 మందికి పదోన్నతిపై స్టే
- గత ఆదేశాలను పట్టించుకోరా అంటూ తలంటిన ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించిన సూరత్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సహా కింది కోర్టుల్లో పనిచేసే 68 మంది న్యాయాధికారులకు జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ గుజరాత్ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. వీరి పదోన్నతి చట్ట వ్యతిరేకమని తెలిపింది. హరీశ్ హస్ముక్‌భాయ్ వర్మ సహా 68 మంది న్యాయమూర్తులను జిల్లా జడ్జి కేడర్‌కు ప్రమోట్ చేస్తూ గత నెలలో గుజరాత్ హైకోర్టు జాబితాను జారీ చేసింది. ఈ జాబితాను సవాల్ చేస్తూ సివిల్ జడ్జి కేడర్‌కు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు మహేతా, మెహతా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'మెరిట్ - కమ్ - సీనియారిటీ' ఆధారంగా కాకుండా.. 'సీనియారిటీ - కమ్- మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. గుజరాత్ ప్రభుత్వం, గుజరాత్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు నోటీసులు జారీ చేసింది. కోర్టు నుంచి నోటీసులు వచ్చినప్పటికీ.. గుజరాత్ ప్రభుత్వం ఆ న్యాయమూర్తులకు ప్రమోషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై గురువారం మరోసారి విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. గుజరాత్ ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని తెలిసి కూడా ప్రభుత్వం వారికి పదోన్నతి కల్పించడం దురదృష్టకరమని పేర్కొంది. "ఈ కోర్టు నిర్ణయానికి భిన్నంగా ఆ న్యాయమూర్తులకు పదోన్నతి కల్పించడం చట్టవిరుద్ధం. ఆ ప్రమోషన్ జాబితా అమలుపై స్టే విధిస్తున్నాం. పదోన్నతి దక్కిన న్యాయమూర్తులు తిరిగి వారి గత పదవుల్లోకి వెళ్లిపోవాలి" అని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ధర్మాసనం తదుపరి విచారణ జరుపుతుందని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఆర్ షా ఈ నెల 15న పదవీ విరమణ చేయనుండటంతో, ఈ అంశాన్ని కొత్త ధర్మాసనానికి సిజెఐ కేటాయించనున్నారు.

'ఉపాధి' సమస్యలపై చలో అసెంబ్లీ

- ఫేసియల్ యాప్‌తో సహా డిజిటల్ అడ్డంకులన్నీ తొలగించాలి
- రెండు పూటలా మస్టర్ వద్దు
- వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

కలెక్టరేట్‌కు ఉపాధి కార్మికులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న దడాల సుబ్బారావు, ఇతర నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సకాలంలో స్పందించి పరిష్కరించకపోతే వచ్చే జూన్‌లో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు హెచ్చరించారు. ఫేసియల్ రికగ్నైజేషన్ ఆధారిత మస్టర్‌తో సహా డిజిటల్ అడ్డంకులన్నిటినీ తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానంగా రెండు పూటలా మస్టర్ విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి వాటికి తగ్గట్టు ఆదాయం పెంచడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం పని చేస్తోందని, ఆ పార్టీకి చరమగీతం పాడాలని కోరారు.

నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా రెండు పూటలా ఫొటో మస్టర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. లేకపోతే జూన్‌లో చలో అసెంబ్లీ చేపడతామని తెలిపారు. వేసవి ఎండలను తాళలేక అనేక మంది ఉపాధి కార్మికులు చనిపోతున్నారని, వారి కుటుంబాలన్నిటినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో నీడ ఏర్పాటు, మజ్జిగ, త్రాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ.. మున్సిపాల్టీల్లో విలీనం చేసిన గ్రామాల్లో ఉపాధి పనులు నిలిపివేయడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సిఐటియు జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించారు. అనంతరం ఉపాధి కార్మికులు కలెక్టరేట్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. 11 మందిని మాత్రమే అనుమతించడంతో వారు వెళ్లి డిఆర్ఒ, డ్వామా ఎపిడికు వినతిపత్రం అందజేశారు.

కర్ణాటకలో పాగా వేసేదెవరో తేలేది నేడే

- ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- మధ్యాహ్నానికే సంపూర్ణం !

బెంగళూరు : దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షిస్తున్న కర్ణాటకలో పాగావేసేదెవరో శనివారం తేలనుంది. 224 స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీకి బుధవారం ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఓట్ల లెక్కింపు శనివారం ఉదయం 8 గంటలకే మొదలవుతుంది. మధ్యాహ్నానికల్లా పూర్తి ఫలితాలు వెలువడే అవకాశముంది. ఈ ఎన్నికల్లో కర్ణాటక చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో అత్యధికంగా 73.19 శాతం ఓటింగ్ నమోదైంది. ఎగ్జిట్ పోల్స్‌లో అత్యధిక భాగం బిజెపికి గట్టి ఎదురు దెబ్బ తగలడం ఖాయమని తేల్చి చెప్పాయి. కాంగ్రెస్‌కు 100 నుంచి 119 వరకు సీట్లు రావచ్చని, 25 నుంచి 35 సీట్లు దాకా గెలుచుకుని హెచ్‌డి కుమారస్వామి నేతృత్వంలోని జెడి(ఎస్) కింగ్ మేకర్ పాత్ర పోషించే అవకాశముందని అవి జోస్యం చెప్పాయి. గత సారి ప్రజా తీర్పుకు విరుద్ధంగా ఫిరాయింపులు, ప్రలోభాలతో అధికారాన్ని చేజిక్కించుకున్న బిజెపి ఈసారి రెండంకెలకే పరిమితం కానుంది. ఆ పార్టీకి 70 నుంచి 90 సీట్లు మాత్రమే రావచ్చని జన్‌కీ బాత్ మినహా అన్ని ఎగ్జిట్ పోల్స్ తేల్చి చెప్పాయి.

ఏనుగుల దాడిలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- కుప్పం (చిత్తూరు జిల్లా)

వేర్వేరు ఘటనల్లో ఏనుగుల దాడులో శుక్రవారం ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా కుప్పం మండలం పర్తిచేను గ్రామానికి చెందిన ఉషా (42) కూలి పనుల కోసం ప్రతిరోజూ మాదిరిగానే బెంగళూరుకు వెళ్లేందుకు శుక్రవారం వేకువజామున మల్లానూరు రైల్వే స్టేషన్‌కు కాలినడకన వెళ్తున్నారు. ఏనుగులు దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మతి చెందారు. అదే గ్రామ పంచాయతీ సప్పానికుంట గ్రామానికి చెందిన శివలింగం (56) తన పొలంలోకి వెళుండగా రెండు ఏనుగులు దాడి చేశాయి. దీంతో, ఆయన అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ ఘటనలపై టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని కలెక్టర్‌కు లేఖ రాశారు.

జ్యుడీషియల్ ప్రివ్యూ కోసం టెండర్ డాక్యుమెంట్లు

- ఎపిఎస్‌ఆర్‌టిసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2023-24 సంవత్సరానికి సంబంధించి బిఎస్-6 ప్రమాణాలతో కూడిన 11, 12 మీటర్ల నిడివిగల 1489 చాసిస్‌లను నేరుగా చాసిస్ తయారుదారుల నుంచి టెండర్ ప్రక్రియ ద్వారా కొనుగోలు చేసేందుకు నిర్ణయించిన టెండర్ డాక్యుమెంట్లను జ్యుడీషియల్ ప్రివ్యూ కోసం జస్టిస్ బి శివశంకరరావుకు పంపినట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి చీఫ్ మెకానికల్ ఇంజినీరు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జ్యుడీషియల్ ప్రివ్యూ అధికారిక వెబ్‌సైట్ www.judicialpreview.ap.gov.inలో 11.5.2023 నందు పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలు, సూచనలు 19.5.2023 సాయంత్రం 5 గంటల లోపు జ్యుడీషియల్ ప్రివ్యూ వారి అధికారిక మెయిల్ judge-jpg@ap.gov.in, ap judicial-preview@gmail.comకు పంపాలని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఏ వ్యూహమైనా రాష్ట్ర హితం కోసమే : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో తాము ఏ వ్యూహాన్ని రచించినా రాష్ట్ర హితం కోసమేనని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. బిజెపి, టిడిపి, జనసేన పొత్తు ఉంటుందన్నారు. సిఎం పదవి రావాలంటే సముచిత స్థానాల్లో జనసేన అభ్యర్థులను గెలిపించాలని, ఆ ఆలోచనలతోనే రాజకీయాలు చేయాలన్నారు. పొత్తుపై బిజెపితో ఆ స్థాయి చర్చలు ఇంకా జరగలేదన్నారు. పొత్తు కొలిక్కి వచ్చాక ప్రజల మధ్య ఒప్పందం చేసుకుంటామన్నారు. ఇప్పుడు కావాల్సింది ముఖ్యమంత్రిని గద్దెదించడమేనన్నారు. త్రిముఖ పోటీలో బలికావడానికి జనసేన సిద్ధంగా లేదని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు.

దళితుల సమస్యలపై 21న రౌండ్‌టేబుల్ : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో దళితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై కూలంకుషంగా చర్చించేందుకు ఈ నెల 21న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వెల్లడించారు. విజయవాడలోని హోటల్ ఐలాపురంలో ఈ సమావేశం జరగనుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో(వైసిపి మినహా)సహా దళిత కుల సంఘాలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగేళ్లుగా జగన్ పాలనలో దళితులు, అట్టడుగు వర్గాల వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దళిత ద్రోహిగా జగన్ నిలిచిపోవడం ఖాయమని పేర్కొన్నారు.

ప్రజల తిరుగుబాటు తప్పదు : బిజెపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైసిపి అరాచకపాలన, పోలీసు రాజ్యంపై ప్రజల తిరుగుబాటు తప్పదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కావలిలో సిఎం పర్యటన నేపథ్యంలో బిజెపి నేతలపై పోలీసులు కిరాతకంగా వ్యవహరిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి సమస్యలు చెబుదామనే దిశగా ఎమ్మెల్యేల అరాచకాలు చెప్పేందుకు వెళ్లిన ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సురేష్‌ను పోలీసులు బూటు కాళ్లతో తన్నిన సంఘటన చూస్తే రాష్ట్రంలో పోలీసు పాలన నడుస్తున్నట్లుగా ఉందని సోము వీర్రాజు పేర్కొన్నారు. బిజెపి నేతలను బూట్ కాళ్లతో తన్నిన పోలీసులపై కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజధాని అమరావతిలో ఉద్రిక్తత

- ఆర్5 జోన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులను అడ్డుకున్న రైతులు
- పెట్రోల్ డబ్బాలతో ప్రొక్లయినర్ల కింద పడుకుని నిరసన
- తుళ్లూరులో ప్రదర్శన, సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ధర్నా

తుళ్లూరులో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. తుళ్లూరు మండలం దొండపాడు సమీపంలోని పిచికలపాలెం వద్ద పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం భూమి చదును పనులను రైతులు, మహిళలు అడ్డుకున్నారు. పనులు ఆపాలని, ప్రొక్లయినర్లను వెనక్కు తీసుకెళ్లాలని పదేపదే కోరినా పట్టించుకోపోవడంతో ఒంటిపై పెట్రోలు పోసుకునేందుకు మహిళా రైతులు సిద్ధమయ్యారు. పెట్రోల్ డబ్బాలను లాక్కునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో డబ్బాలోని పెట్రోలు మహిళా రైతులు బండ్లమూడి జ్యోతి, మైనేని గిరిజతోపాటు పోలీసులపైనా పడింది. దీంతో వారిని 108లో ఆస్పత్రికి తరలించారు.

ఆర్-5 జోన్‌లో 1,134 ఎకరాలతోపాటు దొండపాడు, నెక్కల్లులోని మరో 268 ఎకరాలను కలిపి మొత్తం 1,402 ఎకరాలను 50 వేల మందికి ఒకొక్కరికి సెంటు చొప్పున పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. భూమిని చదును చేసి ప్లాట్లు వేస్తున్నారు. ఆర్-5 జోన్‌ను నిరసిస్తూ నెక్కల్లులో రైతులు, మహిళలు ఆందోళనకు దిగారు. పేదల ముసుగులో వైసిపి ప్రభుత్వం అమరావతిపై కుట్రలను కొనసాగిస్తోందని మండిపడ్డారు. రైతుల ఆందోళనలతో జంగిల్ క్లియరెన్స్ పనులను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ తుళ్లూరులో రైతులు, మహిళలు, వ్యవసాయ కార్మికులు రైతు దీక్షా శిబిరం దగ్గర నుంచి సిఆర్‌డిఎ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్వల్ప వాగ్వాదం తలెత్తింది. రైతులు, మహిళలు గేటు నెట్టుకుంటూ లోపలికి వెళ్లి కార్యాలయం ఆవరణలో ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. అసైన్డ్ రైతులకు, ఇతర పేదలకు కౌలు చెల్లించలేదని, సామాజిక పింఛన్ రూ.5 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, పట్టా భూములతో సమాన ప్యాకేజీ హామీ అమలుకు నోచకోలేదని విమర్శించారు. రాజధాని పేదలు జీవనోపాధి కోసం వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ విస్మరించిన ప్రభుత్వం రాజధాని విచ్ఛిన్నాన్ని కొనసాగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు పి.సుధాకరరావు, కె.శిరీష, జి.మార్టిన్, ఎ.సువర్ణకమల, సిహెచ్..బసవయ్య పాల్గొన్నారు.

ఒంటిపై పెట్రోల్ పడటంతో మహిళా రైతులు జ్యోతి, గిరిజను 108లో ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

ఆస్తుల విభజనపై కౌంటర్ దాఖలు చేయండి

- తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజనకు సంబంధించి రిటైర్డు న్యాయమూర్తితో కమిటీ వేయాలని సుప్రీంకోర్టుకు ఎపి ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. కేంద్రం అభిప్రాయం తెలుసుకున్న సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొంది. రూ.1,42,601 కోట్లకు సంబంధించి ఆస్తుల విభజనపై ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. గత విచారణ సందర్భంగా నోటీసులు ఇచ్చి ఐదు నెలలు గడిచినా తెలంగాణ ప్రభుత్వం ఇంకా కౌంటరు దాఖలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించగలదా? అని అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) నటరాజన్‌ను అడిగిన ధర్మాసనం, కౌంటరు ఎందుకు దాఖలు చేయలేదని తెలంగాణ తరపున న్యాయవాదిని ప్రశ్నించింది. చివరి అవకాశంగా నాలుగు వారాలు గడువు ఇవ్వాలని తెలంగాణ న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. ఆస్తుల విభజన 'విభజన చట్టం'లోని అంశమని, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లో ఉన్న సుమారు రూ.1.42 లక్షల కోట్లు విభజించకపోవడం సరికాదని సింఘ్వి పేర్కొన్నారు. ఉద్యోగుల విభజనపై జస్టిస్ ధర్మాధికారి కమిటీ నియమించినట్లు ఈ వ్యవహారంపైనా విశ్రాంత న్యాయమూర్తితో కమిటీ నియమించాలని కోరారు. ఆ విధంగా చేయొచ్చా అని నటరాజన్‌ను ధర్మాసనం ప్రశ్నించగా.. చేసే అవకాశం ఉందని ఎఎస్‌జి సమాధానమిచ్చారు. వాదనల అనంతరం నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలను ధర్మాసనం ఆదేశించింది. రిజాయిండర్ దాఖలకు రెండు వారాలు గడువిచ్చిన ధర్మాసనం తదుపరి విచారణ జులై చివరి వారానికి వాయిదా వేసింది. విభజన జరగాల్సిన 91 శాతం ఆస్తులు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఎపి తెలిపింది. ఎనిమిదేళ్లయినా ఆస్తుల విభజనకు తెలంగాణ సహకరించడం లేదని ఎపి వెల్లడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ప్రకారం ఎపి ప్రజల హక్కులకు తెలంగాణ భంగం కలిగించిందంటూ పిటిషన్‌లో ఎపి పేర్కొంది. ఆస్తుల విభజన త్వరగా జరిగేలా ఆదేశాలివ్వాలని సుప్రీంను ఎపి కోరింది.

ఆర్భాటంగా ప్రారంభమైన
శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

సంకల్పం తీసుకున్న సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యాన విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 'అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం' కార్యక్రమం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. ఈ యజ్ఞం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ కార్యక్రమంలో సిఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాల్గొని యజ్ఞ సంకల్పం తీసుకున్నారు. గోశాల వద్ద కపిల గోవుకు హారతిచ్చి అఖండ దీపారాధనలో పాల్గొన్నారు. మహాయజ్ఞం ఈ నెల 12 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. యజ్ఞం వైఖానసం, పాంచరాత్రం, వైదికస్మార్తం అనే నాలుగు ఆగమములతో యజ్ఞములు, వీరశైవం, తంత్రసారం, గ్రామ దేవతారాధన, చాత్తాద శ్రీ వైష్ణవం అనే నాగులు ఆగమముల ప్రకారంగా జప పారాయణములు నిర్వహించనున్నారు. యజ్ఞ దీక్షను దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆయన భార్య కొట్టు సాధనికుమారి యజ్ఞ దీక్షను తీసుకున్నారు.

దేవాదాయశాఖపై విమర్శలు వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తొలి ధార్మిక కార్యక్రమానికి కేబినెట్ మంత్రులు, ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానాలు అందలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే యజ్ఞం తొలిరోజు కేవలం ముగ్గురు, నలుగురు మంత్రులు మినహా మిగిలినవారు పాల్గొనలేదనే చర్చ నడుస్తోంది. ఈ వ్యవహారంలో దేవాదాయశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యులు యజ్ఞం సమీపంలో కూర్చుని చూసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. భక్తులకు సరిపడినన్ని టాయిలెట్లు ఏర్పాట్లు చేయలేదని ఆరోపిస్తున్నారు.

100 శాతం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఉండాలి

- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- సచివాలయ, వాలంటీర్ వ్యవస్థను ఉపయోగించుకోవాలి
- కలెక్టర్లు, డిఇఒలకు సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో 100 శాతం విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జిఇఆర్)పై దృష్టి సారించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లా కలెక్టర్లు, డిఇఒలను ఆదేశించారు. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయాల సేవలను వినియోగించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల మధ్య పోటీని సృష్టించి తద్వారా ఆయా సచివాలయాల పరిధిలో 100 శాతం జిఇఆర్ సాధించి తాము గర్వంగా ప్రకటించుకునేలా ఆ వ్యవస్థలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో 2005 సెప్టెంబరు 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించిన ప్రతి బిడ్డ 1 నుంచి 12వ తరగతి వరకు చదివి ఉత్తీర్ణత సాధించారా? లేదా అన్న విషయాన్ని పరిశీలించాలని చెప్పారు. ఏ ఒక్కరూ పాఠశాల, కళాశాలలో చేరకుండా ఉండకూడదని, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. జిఇఆర్ సాధించే క్రమంలో వాలంటీర్ల సేవలను ఉపయోగించుకోవాలని, తదనుగుణంగా శిక్షణ అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి సచివాలయ పరిధిలోని వాలంటీర్‌కు కేటాయించిన 50 గృహాల పరిధిలోని ఇళ్లను సందర్శించి పిల్లల వివరాలు సేకరించాలని తెలిపారు. 18 నుంచి 23 ఏళ్ల వయసు ఉన్నవారు కళాశాలలో చేరేలా చర్యలు చేపట్టడం ద్వారా 100 శాతం జిఇఆర్ సాధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, పాలిటెక్నిక్, ఐటిఐ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించాలని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను కార్పొరేట్ స్థాయిలో అందించేందుకు ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిందని పేర్కొన్నారు. 100 శాతం అక్షరాస్యత, 100 శాతం జిఇఆర్ పెంచే లక్ష్యంగా అధికారులు అడుగులు వేయాలని ఆదేశించారు.

30 నుంచి జెవికె కిట్లు సరఫరా

జగనన్న విద్యాకానుక (జెవికె) కిట్లను మండల స్టాకు పాయింట్ నుంచి పాఠశాలలకు స్కూల్ కిట్లు అందించేందుకు ముందస్తుగానే రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని అధికారులకు ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. ఈ నెల 30 నుంచే పాఠశాలలకు సరఫరా ప్రారంభించాలని, ఈ లోపు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పూర్తి కిట్ సిద్ధం చేయాలని తెలిపారు. జెవికె సరఫరా తీరుపై పాఠశాల విద్య, సమగ్ర శిక్షా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో ఈ నెల 30 నాటికి 'క్వాలిటీ వాల్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సరఫరాదారుల నుంచి వచ్చిన వస్తువుల్లో అందుకున్నవి, తిరస్కరించిన వాటి వివరాలను డెలివరీ చలానాల్లో మండల విద్యాశాఖ అధికారి సంతకం చేసి జెవికె యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పాడైన, బాగోలేని వస్తువులను వెంటనే భర్తీ చేయాలని చెప్పారు. మండల స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు కిట్లు అందించేలా రూట్‌మ్యాప్ రూపొందించుకోవాలన్నారు. పాఠశాల తెరిచేనాటికి ప్రతి విద్యార్థికీ కిట్ అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, కడియం

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే టిడిపి మహానాడు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు తెలిపారు. టిడిపి మహానాడు ప్రాంగణ నిర్మాణానికి శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న 15 వేల మంది ప్రతినిధులతో మహానాడు నిర్వహిస్తామన్నారు. 28న ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల ముగింపు సభను 15 లక్షల మందితో ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. మహానాడు తొలిరోజు ప్రతినిధుల సభలో వైసిపి పాలనకు వ్యతిరేకంగా 15 తీర్మానాలు ప్రవేశపెడతామని తెలిపారు. మహానాడు నిర్వహించేందుకు టిడిపి శ్రేణులు సిద్ధమవుతుంటే, వైసిపి సర్కారు కవ్వింపు చర్యలకు దిగుతోందన్నారు. రాజమండ్రి ఎంపి మార్గాని భరత్ ఈ నెలాఖరు వరకు రాజమండ్రి సిటీతోపాటు పరిసర ప్రాంతాల హోర్డింగులన్నీ బ్లాక్ చేయించారన్నారు.

టిడిపి వారికి బోర్డులు ఇవ్వరాదని అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలకు హుకుం జారీ చేశారని ఆరోపించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, పి.అశోక్‌బాబు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి భవాని, నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, చింతకాయల అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, బీదా రవిచంద్ర యాదవ్, టిడిపి జాతీయ అధికార ప్రతినిధి బొండా ఉమామహేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

చంద్రబాబు కోసం పనిచేస్తోన్న పవన్ : ఉష శ్రీచరణ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు కోసం జనసేన పనిచేస్తోందని పవన్‌కల్యాణ్ చెప్పకనే చెబుతున్నారని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి ఉష శ్రీచరణ్ విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఏ పార్టీ ఎవరితో పొత్తుపెట్టుకున్నా వైసిపి స్వతంత్రంగానే పోటీ చేస్తుందన్నారు. చంద్రబాబు కోసం పనిచేస్తున్నందుకే సిఎం పదవిని పవన్‌కల్యాణ్ కోరుకోవడం లేదని అన్నారు. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకన్నా గొప్పగా ఏం చేయగలరో ఇప్పటి వరకూ టిడిపి చెప్పలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమం, వికాసం, సాధికారతకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అంతకు ముందు కాజ గ్రామంలో ఎస్‌కెసివి అమోదిని నిరాశ్రయ బాలల సంరక్షణ గృహాన్ని తనిఖీ చేశారు. సంరక్షణ గృహంలోని వసతి గదులను, భోజనశాలను, స్వయం ఉపాధి శిక్షణ కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు.

జివో నెం1 రద్దుపై ఎవరేమన్నారు?

గెలిచేది అంబేద్కర్ రాజ్యాంగమే : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో అంతిమంగా గెలిచేది, నిలిచేది అంబేద్కర్ రాజ్యాంగమేనని, జగన్ నియంతృత్వం కాదని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. జిఓ 1ని రద్దు చేస్తూ హైకోర్టు తీర్పును శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో స్వాగతించారు. జగన్ వంటి నాయకులు వస్తారని నాడే ఊహించి భారత రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ఉన్నతమైందని, అధికారం తెచ్చిన అహంకారం, నియంత ఆలోచనలు దీని ముందు నిలబడవని మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. ప్రజలను, ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై గొంతెత్తకుండా చేయాలనే దురుద్దేశంతో వైసిపి ప్రభుత్వం తెచ్చిన జిఓ 1ని హైకోర్టు కొట్టేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. జిఓ 1 రద్దుతో జగన్ మూర్ఖత్వానికి చెంపపెట్టు అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు మరో ప్రకటనలో విమర్శించారు. ఫ్యాక్షన్ పాలనపై ప్రజాస్వామ్యం గెలిచిందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వానికి చెంపపెట్టు : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జివో నెంబరు 1ను హైకోర్టు కొట్టి వేయడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్త చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజాసమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయకుండా రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను నిరంకుశంగా అణచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఓ నెంబరు 1కి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తినా ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడకుండా మరింత పటిష్టంగా జిఓను అమలు చేయాలని చూసిందని విమర్శించారు. మంత్రుల పర్యటనల పేరుతో ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రజల నిరసనలను లెక్కచేయని వైసిపి ప్రభుత్వానికి ఈ తీర్పు చెంపపెట్టని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పోకడలు విడనాడి పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలని శ్రీనివాసరావు కోరారు.

ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలను ఇబ్బందులు పెట్టేందుకే జివో 1ను జగన్ ప్రభుత్వం విడుదల చేసిందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జివోను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునివ్వడం వైసిపి ప్రభుత్వానికి చెంపపెట్టు అని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలను గౌరవించాలని సూచించారు. ప్రజా ఉద్యమాలపై పోలీసులను ప్రయోగించి, ఉక్కుపాదం మోపటం మానాలని తెలిపారు.

సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు తీర్పు నివ్వడాన్ని సిఐటియు స్వాగతిస్తోందని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరంకుశ జివో రద్దు కోసం కృషి చేసిన వారందరికీ ఈ సందర్భంగా సిఐటియు పక్షాన అభినందనలు తెలిపారు. ప్రజాస్వామికంగా నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించకుండా రాష్ట్రప్రభుత్వం జివో 1 ఇచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలు నిర్వహించకుండా నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని విమర్శించారు. జివో 1పై హైకోర్టు తీర్పు రాష్ట్రప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం ఆందోళనలపై నిర్బంధాన్ని ప్రయోగించే పద్ధతి విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ జివో రద్దు కోరుతూ అనేక రూపాల్లో ఆందోళన మేధావులు, ప్రగతి శీలురు, ప్రజాసంఘాలు, ట్రేడ్ యూనియన్లకు అభినందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామిక విజయం : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిఓ నెంబరు 1 రద్దు తీర్పు ప్రజాస్వామిక విజయమని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే సంఘాలు, ప్రతిపక్ష పార్టీల గలం వినిపించకుండా చేసేందుకు తీసుకొచ్చిన నియంతృత్వ జిఓ నెంబరు రద్దు చేయడం హర్షణీయమన్నారు.

ఇది ప్రజా విజయం : గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిఓ నెంబరు 1పై హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రజల విజయమని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజల తరపున హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేసి కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసి సాధించిన విజయమన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు జిఓ తెచ్చిందని, పోలీస్ యాక్ట్ 30కి భిన్నంగా జిఓ 1ని జారీ చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 771వ రోజుకు చేరాయి. దీక్షల్లో డివైఎఫ్ఐ కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లకుపైగా స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఉద్యమం కొనసాగుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడి ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంట్ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించడంతోపాటు పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిగేలా చూడాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు. పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

భూ పత్రాల అప్‌గ్రేడ్

మొదటిపేజి తరువాయి

ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రైతుల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం తనదేనని పేర్కొన్నారు. పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నామన్నారు. దళారులు, మిల్లర్ల పాత్ర లేకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, 21 రోజుల్లో నగదు చెల్లిస్తున్నామని తెలిపారు. ఆర్‌బికెల ద్వారా వైఎస్‌ఆర్ భరోసా, బీమా పరిహారం అందజేస్తున్నామన్నారు. అనంతరం రైతులకు భూ హక్కుపత్రాలు అందజేశారు. వికలాంగులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎంఎల్‌సిలు పి.చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్, మాధవరావు, ఎంఎల్‌ఎలు రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డికుమార్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత రైతులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. వారితో కలిసి ఫొటో దిగారు. రైతులు వరి ధాన్యాల మాలతో సిఎంను సన్మానించారు. ఉదయం 11 గంటలకు వచ్చిన ఆయన మధ్యాహ్నం 2.19 గంటలకు తిరిగి విజయవాడ బయలుదేరారు.

డైలీ వేజ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కదలిక !

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చిరుద్యోగుల రెగ్యులరైజేషన్‌పై దాదాపు రెండు దశాబ్దాల తరువాత ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్ (నార్మల్ మస్టర్ రోల్), రోజు వారీ వేతనాలు (డైలీ వేజ్) తీసుకునే ఉద్యోగులను క్రమబద్ధీకరించే అంశంపై ఆర్థికశాఖలో కదలికలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే దరఖాస్తులు వచ్చినవి, కోర్టు కేసుల్లో ఉన్నవాటిని అధ్యయనం చేసేందుకు నిర్ణయించారు. తమను రెగ్యులర్ చేయాలని, మినిమమ్ టైమ్‌స్కేల్ వర్తింపజేయాలని, డియర్‌నెస్ అలవెన్సులు, ఇళ్ల అద్దె, వార్షిక ఇంక్రిమెంట్లు, రెగ్యులర్ చేసే అంశాలను పరిశీలించాలని ఈ వినతుల్లో ఉన్నాయి.

తొలి దశగా రెగ్యులర్ చేయాల్సిన ఉద్యోగుల వివరాలు సేకరించాలని డిడిఓ (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్స్)ను ఆర్థికశాఖ ఆదేశించింది. ఈ వివరాలను ఎపిసిఎఫ్‌ఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని నిర్దేశించింది. వచ్చిన దరఖాస్తులు, న్యాయస్థానాల్లో ఉన్న కేసుల వివరాలను తాము సూచించిన ప్రొఫార్మా ద్వారా అందించాలని ఆర్థికశాఖ పేర్కొంది. ప్రధానంగా రెండు రకాలుగా ఈ పరిశీలన చేయనున్నారు. సాధారణ రెగ్యులరైజేషన్, దరఖాస్తుల పున్ణపరిశీలన ఆధారంగా ముందుకు సాగనున్నారు. దీనికోసం లక్ష్యాలను కూడా నిర్దేశించారు. ముందుగా సంబంధిత అధికారులకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. దరఖాస్తుల పరిశీలన 10వ తేదీకి పూర్తి చేయాలని, వాటిని సిఎఫ్‌ఎంఎస్‌లో 11న నమోదు చేయాలని, పరిశీలన అనంతరం 15వ తేదీ నాటికి పూర్తి డేటాను అప్‌లోడ్ చేయాలని నిర్ణయించారు.

ఇక రెండు రకాల ప్రొఫార్మాలను కూడా ఆర్థికశాఖ సిద్ధం చేసి డిడిఓలకు పంపించింది. ఉద్యోగి నియామకం నుంచి, అతని సర్వీసు, ఇప్పటికే ఆ ఉద్యోగి మరణించినట్టయితే ఆ వివరాలు, ఉన్న ఉద్యోగికి సంబంధించిన కోర్టు కేసుల వివరాలు, ఆ కేసులపై ప్రభుత్వం తరపున దాఖలు చేసిన అఫిడవిట్ వివరాలు సమర్పించాలని నిర్దేశించింది.

ముగిసిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-1998 అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని డిఎస్‌సి-1998 పోస్టుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. మూడోరోజు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించకుండా అభ్యర్థులను మోసం చేసిందని విమర్శించారు. దళిత, గిరిజన బలహీనవర్గాలు, వికలాంగులు, మహిళలకు అన్యాయం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. దీక్షలకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు వి వెంకటేశ్వర్లు, ఎపి రెల్లి సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగేంద్ర మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు జి నటరాజు, పోరాట కమిటీ ఉపాధ్యక్షులు పులివెందుల రమేష్, సభ్యులు బి శ్రీనివాసరావు, పి రమేష్, మేరీ సుహాసిని, ఈపనగండ్ల శ్రీనివాసులు, రంగస్వామి, సుమన్, జ్యోతి పాల్గొన్నారు.

తిరుమలలో 14 నుంచి హనుమత్ జయంతి

ప్రజాశక్తి - తిరుమల

ఈ నెల 14 నుంచి 18 వరకు హనుమత్ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో వేసవి రద్దీ ప్రారంభమయ్యిందని, రోజుకు శ్రీవాణి, ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300, ఎస్‌ఎస్‌డి, దివ్య దర్శనం టోకెన్లు కలిపి 55 వేలు కేటాయిస్తున్నామని చెప్పారు. సర్వదర్శనంలో రోజుకు 10 నుంచి 15వేల మందికి మాత్రమే దర్శనం కల్పించేందుకు అవకాశం ఉందని, భక్తులు సహకరించాలని కోరారు.

వేతన ఒప్పందం హుళక్కే !

- స్టీల్‌ప్లాంట్‌పై మోడీ సర్కారు మరో ద్రోహం
- ఎనిమిదేళ్లుగా నూతన వేతనాలకు నోచుకోని కార్మికులు, అధికారులు
- 1982 సెయిల్ ఎంఒయుకు తూట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా ప్రయివేటీకరణ చేయాలనే కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తూ కార్మికులు, ఉద్యోగుల నూతన ఒప్పందానికి మోకలడ్డుతోంది. 2016 డిసెంబర్‌లో వేతన ఒప్పందం గడువు ముగిసినా నేటికీ నూతన ఒప్పందాన్ని అమలు చేయడం లేదు. 1982లో సెయిల్‌తో కుదుర్చుకున్న ఎంఒయుకు తూట్లుపొడుస్తోంది. ఉక్కు కార్మికులు, అధికారులకు ద్రోహం చేసే చర్యలకు పాల్పడుతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు.

నూతన వేతనాల అమలు కోసం ధర్నా చేస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు (ఫైల్)

వేతన ఒప్పందం కథేమిటి ?

ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికులు, అధికారులకు ఐదేళ్లకోసారి వేతన ఒప్పందం జరుగుతుంది. దేశంలో సెయిల్ సహా ఏడు స్టీల్‌ప్లాంట్‌లు నడుస్తున్నాయి. 2016 డిసెంబరుతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వేతన ఒప్పందం ముగిసింది. 2017 డిసెంబరు నుంచి కొత్త ఒప్పందం ప్రారంభం కావాలి. కానీ అలా జరగకపోవడంతో 10,500 మంది కార్మికులు, 5,100కి పైచిలుకు అధికారులు నష్టపోయారు. నాటి నుంచి కార్మికులు, అధికారులు పోరాటం చేయడంతో 2020లో నేషనల్ జాయింట్ కమిటీ ఫర్ స్టీల్ (ఎన్‌జెసిఎస్)తో సెయిల్‌లో చర్చలు జరిగాయి. 2021 డిసెంబరులో అధికారులు, కార్మికులకు అగ్రిమెంట్ జరిగింది. 13 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్ (ఎంజిబి), 26.5 శాతం పెర్క్స్ అంటే అలవెన్సు అప్పటికే వారు తీసుకుంటున్న వేతనంపై పర్సంటేజీల వారీగా పెంచాలని చర్చలు సాగాయి. ఈ మేరకు అధికారులు, కార్మికులకు సెయిల్‌లో వేతన ఒప్పందం జరిగింది.

ఒప్పందం సరే.. ఉల్లంఘన ఎక్కడ జరిగింది ?

1982లో సెయిల్ నుంచి ఆర్‌ఐఎన్‌ఎల్ వేరుపడినప్పుడు సెయిల్‌లో జరిగే అన్ని ఒప్పందాలు, బెనిఫిట్స్ ఆర్‌ఐఎన్‌ఎల్‌లో అమలు చేస్తామని లిఖితపూర్వకంగా రాసిచ్చారు. అంటే సెయిల్‌లో ఏ ఒప్పందం జరిగినా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో అమలు కావాలి. కానీ ఈ వేతన ఒప్పందాన్ని స్టీల్‌ప్లాంట్‌లో అమలు చేయడం లేదు. 2021 అక్టోబర్‌లో సెయిల్‌లో జరిగిన ఎంఒయులో వేతనం ఒప్పందం అమలు గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఇది ఎన్‌జెసిఎస్ నుంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వేరు చేయడం, ఎన్‌జెసిఎస్‌ను ముక్కలు చేసే కుట్ర తప్ప మరొకటి కాదని కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ వేతన ఒప్పందంపై అప్పట్లో సిఐటియు, బిఎంఎస్ సంతకాలు పెట్టలేదు. కానీ ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్ సంతకాలు పెట్టేశాయి. మెజారిటీ పేరుతో దీన్నే యాజమాన్యం ద్వారా కేంద్రం అమలు చేయించడం ఒక దుర్మార్గమైన చర్య.

వేతన ఒప్పందంలో మరో ట్విస్ట్

గతంలో ఐదేళ్లకు వేతన ఒప్పందం జరిగేది. మోడీ వచ్చాక పది సంవత్సరాలకు పెంచేశాడు. బిజెపి చేసిన ఈ కొత్త వేతన ఒప్పందంతో వేల సంఖ్యలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని కొత్త కార్మికులు ఒప్పందం పరిధిలోకి రాకుండా పోయారు.

మోడీ సర్కారు తీరును వ్యతిరేకిస్తున్నాం

దేశంలో ఎక్కడా లేని వేతన ఒప్పందాన్ని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో చేయడం వెనుక ప్లాంట్‌ను అమ్మివేసే కుట్ర దాగి ఉంది. ఇది దుర్మార్గం. కార్మికులు ఈ ఒప్పందాన్ని అంగీకరించరు. ఆర్థికంగా ఇప్పటికే చాలా నష్టపోయాం.

ఎస్.శంకర్, స్టీల్ సింటర్ ప్లాంట్ డిపార్టుమెంట్ ఉద్యోగి

ఎదిరించి పోరాడతాం

2020లో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం ప్రారంభమైంది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికులు పోరాటానికి దిగారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రమోషన్లను నాటి నుంచి ఆపేశారు. వేతన ఒప్పందం అమలు కాకుండా మోడీ సర్కారు దుశ్చర్యలకు దిగింది.

జముల్ల నూకరాజు,
స్టీల్ ఆర్‌ఎంహెచ్‌పి డిపార్టుమెంట్ కార్మికులు

15న తహశీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన

- పసుపు రైతుల కన్వీనింగ్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పసుపు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాకు రూ.6,850 మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తహశీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పసుపు రైతుల కన్వీనింగ్ కమిటీ తెలిపింది. ఈ మేరకు కమిటీ రాష్ట్ర కన్వీనరు జొన్నా శివశంకర్, రాష్ట్ర నాయకులు వల్లభనేని సాంబశివరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పసుపు ధరలు భారీగా తగ్గిపోయాయని, క్వింటాకు రూ.4000 నుండి రూ.5000 మాత్రమే ధర పలుకుతోందని తెలిపారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా కొనుగోళ్లు జరగడం లేదని పేర్కొన్నారు. మరోవైపు పంట ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరిగిందని వివరించారు. రైతులకు న్యాయం చేయాలని, కనీస మద్దతు ధరకు పసుపు కొనుగోలు చేయాలని కోరుతూ 15న అన్ని తహశీల్దారు కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ధర్నా, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఎన్‌ఎఫ్‌పిఇయు గుర్తింపు రద్దు తగదు

- కాకినాడలో పోస్టల్ సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎన్‌ఎఫ్‌పిఇయు) గుర్తింపును రద్దు చేయడాన్ని నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యాన కాకినాడలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద పోస్టల్ సిబ్బంది శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎన్‌ఎఫ్‌పిఇయు గుర్తింపును పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని నినదించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టియుసి ఎపి అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఆదినారాయణమూర్తి, టిఎన్‌టియుసి నాయకులు కర్రి రాజారావు మాట్లాడారు. తపాలా శాఖ ప్రయివేటీకరణకు ఎన్‌ఎప్‌పిఇయు అడ్డుపడుతుందన్న కారణంతో గుర్తింపును రద్దు చేయడం దారుణమన్నారు. తపాలా ఉద్యోగుల్లో 70 శాతం మంది ఈ యూనియన్‌లోనే సభ్యత్వానికి కలిగి ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగానే సంఘం గుర్తింపును రద్దు చేసిందని విమర్శించారు. మూడు శాతం ఉద్యోగులు సభ్యులుగా ఉన్న బిఎంఎస్‌కు గుర్తింపు ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న 13 లక్షల పోస్టులను భర్తీ చేయకుండా మోడీ ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. తక్షణమే ఎన్‌ఎఫ్‌పిఇయు గుర్తింపును పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధపడతామని హెచ్చరించారు.

కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పోస్టల్ సిబ్బంది

భారతదేశం ప్రపంచానికి ఆహార భాండాగారం

- ఉద్యాన వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ నజీర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారతదేశం ప్రపంచానికి ఆహార భాండాగారంగా మారిందని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అభివర్ణించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం శివారు వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆర్థిక సూపర్ పవర్‌గా భారతదేశం ఎదుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న జనాభా రీత్యా భవిష్యత్‌లో పోషకాహార భద్రత మరింత ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకోనుందని తెలిపారు. ఉద్యానవన ఉత్పత్తి ఇప్పటికే దేశంలోని వ్యవసాయోత్పత్తిని అధిగమించిందని, ఇది స్థూల జాతీయోత్పత్తిలో ఆరు శాతంగా ఉండటం శుభపరిణామమన్నారు. ఆహారం, పోషకాహార భద్రత సవాళ్లు మన జాతీయ భద్రతలో అంతర్భాగంగా ఇమిడి ఉన్నాయని తెలిపారు. ఉద్యానవన ఉత్పత్తిలో ఇన్‌పుట్ వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి రోబోటెక్ టెక్నాలజీలు, డ్రోన్ల రూపకల్పన, ఉపయోగం వంటి సరిహద్దు సాంకేతికతలతో విశ్వవిద్యాలయమూ ముందుకు సాగడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థులకు అవార్డులు, బంగారు పతకాలను అందించారు. ముఖ్యఅతిథి నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌చంద్ తొలుత స్నాతకోపన్యాసం చేశారు. ఉద్యానవన విద్యలో ఉత్తమ ఫలితాలు పొంది డిగ్రీలు సాధించిన విద్యార్థులు మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ స్థాయిలో రైతులకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ తోలేటి జానకీరామ్ గవర్నర్‌కు మెమెంటోను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి శ్రీనివాసులు, యూనివర్సిటీ బోర్డు మెంబర్లు, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

- అనంత'లో ఐద్వా, మహిళా సంఘాల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఐద్వా, మహిళా సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని శుక్రవారం నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి తదితరులు హాజరై మాట్లాడారు. తమకు జరిగిన అన్యాయానికి నిరసనగా ఢిల్లీలో నెలల తరబడి మహిళా రెజ్లర్‌లు పోరాటం చేస్తుంటే కేంద్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ బిజెపికి చెందిన ప్రజాప్రతినిధి కావడంతో మహిళలకు అన్యాయం జరిగినా ప్రధానమంత్రి స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రధాని స్పందించి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినమ్మ, లక్ష్మి, మహిళా సమాఖ్య నాయకులు పార్వతి ప్రసాద్, నాగమణి, శ్వేత, స్త్రీ విముక్తి సంఘటన సంఘం సరస్వతి, సావిత్రి, వరలక్ష్మి, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు కృష్ణవేణి పాల్గొన్నారు.

సిపిఐ, రైతు సంఘం నాయకులు అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో కె రామకృష్ణ, తదితరులు

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మంగళగిరి సిపిఐ కార్యాలయం నుండి ముట్టడికి బయలు దేరిన సిపిఐ, రైతు సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ, మంగళగిరి సిపిఐ నాయకులు కంచర్ల కాశయ్య, ఇతర నాయకులను కొల్లిపర పోలీస్ స్టేషన్‌కు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు సహా 40 మందిని దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులను ఖండించారు. నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని వినతి పత్రం ఇవ్వడానికి వైఎస్‌ఆర్ ప్రభుత్వం అనుమతివ్వడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలకు 23,000 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.40 వేలు, వాణిజ్య పంటలకు రూ.75 వేలు ఇవ్వాలని, పసుపు క్వింటాలు రూ.12 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

20 నుంచి వైఎస్‌ఆర్ బీమా లబ్ధిదారుల గుర్తింపు

- గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఎమ్‌డి లక్ష్మీశా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2023-24కు సంబంధించి వైఎస్‌ఆర్ బీమా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ఈ నెల 20 నుంచి ప్రారంభించాలని, ప్రతినెలలో అమలయ్యే వివిధ పథకాలకు లబ్ధిదారులను వెంటనే గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయాల అధికారులను గ్రామ, వార్డు సచివాలయాలశాఖ మేనేజింగ్ డైరెక్టరు లక్ష్మీశా ఆదేశించారు. గ్రామ సచివాలయాల పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై విజయవాడలోని ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇళ్లపట్టాల పంపిణీ, బియ్యం కార్డులు, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ, వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పథకాలకు అర్హుల నుంచి నిత్యం దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఇతర పథకాలకు సంక్షేమ కేలండరు ప్రకారం జగనన్న అమ్మఒడి పథకం జూన్ నెలలో అమలవుతుందని, క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ఈ నెల 25 కల్లా పూర్తి చేసి తుది జాబితాను జూన్ 13 నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి కావడానికి సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సంక్షేమ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతిరోజూ సంబంధిత లే అవుట్లను సందర్శించి గ్రామ ఇళ్ల నిర్మాణ తీరును పరిశీలించాలన్నారు. సమీక్షా సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాలశాఖ జాయింట్ డైరెక్టరు భావన వశిష్ట, అదనపు కమిషనర్లు గీతా, సోము నారాయణ, శ్రీకృష్ణమోహన్, 26 జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికోత్పత్తి పడక

- మార్చిలో 1.1 శాతమే పెరుగుదల

న్యూఢిల్లీ : దేశంలో అధిక ధరలు పారిశ్రామిక ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయి. డిమాండ్ లేమితో ఉత్పత్తుల కొనుగోళ్లు తగ్గుతున్నాయి. దీంతో అంతిమంగా తయారీపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఏడాది మార్చిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) పెరుగుదల 1.1 శాతానికే తగ్గి.. ఐదు నెలల కనిష్టానికి పడిపోయింది. ఇంతక్రితం ఫిబ్రవరిలో ఇది 5.6 శాతం వృద్ధిని సాధించింది. 2022-23లో స్థూలంగా 5.1 శాతం పెరుగుదల నమోదు కాగా.. ఇంతక్రితం ఏడాదిలో 2021-22లో ఏకంగా 11.4 శాతం వృద్ధి జరిగింది. దీంతో పోల్చితే గడిచిన ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక ఉత్పత్తిలో మందగమనం చోటు చేసుకుందని స్పష్టమవుతోంది. కేంద్ర గణంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) శుక్రవారం వెల్లడించిన డేటా ప్రకారం.. 2023 మార్చిలో తయారీ రంగం కేవలం 0.5 శాతం పెరుగుదలను మాత్రమే నమోదు చేసింది. గనుల రంగం 6.8 శాతం పెరగ్గా.. విద్యుత్ రంగం ఉత్పత్తి 1.6 శాతం తగ్గింది. కన్స్యూమర్ డ్యూరెబుల్స్ సూచీ వరుసగా నాలుగో మాసంలోనూ పడిపోయింది. ఈ సూచీ మార్చిలో 8.4 శాతానికి తగ్గి.. మూడు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. "మార్చిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) వృద్ధి 1.1 శాతానికి పడిపోవడం చాలా నిరాశపర్చింది. మేము 3.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేశాము. ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగింపు నెల మార్చిలో సాధారణంగా పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుతుంది. కానీ.. ఈ సారి అలా జరగలేదు. ఐఐపి పడిపోవడంతో పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) సూచీలను సమీక్షించాల్సి ఉంటుంది." అని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనామిస్ట్ మదన్ సబ్నవిస్ పేర్కొన్నారు.

4.7 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.7 శాతానికి తగ్గింది. దీంతో వరుసగా రెండో మాసంలోనూ ఆర్‌బిఐ అంచనాల కంటే తక్కువగా చోటు చేసుకోవడం విశేషం. గతేడాది ఇదే ఏప్రిల్‌లో ఏకంగా 7.8 శాతం పెరిగింది. 2023 మార్చిలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 5.66 శాతంగా చోటు చేసుకుంది. 2022-23లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది. జూన్ త్రైమాసికంలో సగటున 5.4 శాతం, క్యూ2లో 5.4 శాతం, క్యూ3, క్యూ4లలో 5.2 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. దీని కంటే తక్కువగా చోటు చేసుకోవడంతో కీలక వడ్డీ రేట్లు తగ్గించడానికి వీలుంది.

ట్విట్టర్ చీఫ్‌గా లిండా యాకరినో..!

శాన్‌ఫ్రాన్సిస్కో : సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్‌కు కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా లిండా యాకరినో నియమితులు కానున్నారని రిపోర్టులు వస్తోన్నాయి. ట్విట్టర్‌కు ఓ మహిళను బాస్‌గా తీసుకురానున్నామని ప్రస్తుత సిఇఒ ఎలన్ మస్క్ తెలిపారు. అయితే మస్క్ ఆమె పేరు చెప్పకపోయినప్పటికీ.. మీడియాలో యాకరినో పేరు చక్కర్లు కొడుతోంది. యాకరినో ప్రస్తుతం ఎన్‌బిసి యూనివర్సల్‌లో అడ్వర్టజింగ్ అండ్ పార్టనర్‌షిప్స్ విభాగం ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమెతో మస్క్‌కు ఎప్పటి నుంచో పరిచయం ఉందని.. తనతో చర్చలు జరుపుతున్నారని సమాచారం.

పోకో ఎఫ్5 5జి విడుదల

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ తయారీదారు పోకో తన కీలకమైన ఎఫ్-సిరీస్‌లో సరికొత్త పోకో ఎఫ్5 5జిని ఆవిష్కరించినట్లు ప్రకటించింది. స్నాప్‌డ్రాగన్ 7ప్లస్ జెన్2తో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 64 ఎంపి ప్రైమరీ కెమెరా, 8ఎంపి, 2ఎంపి మైక్రో కెమెరాలతో సహా సెల్ఫీ కోసం 16ఎంపి కెమెరాను అమర్చినట్లు తెలిపింది. 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో కూడిన 8జిబి, 256 జిబి వేరియంట్ ధరను రూ.29,999గా, 12జిబి, 256 జిబి వేరియంట్ ధరను రూ.33,999గా నిర్ణయించింది. మే 16 నుంచి ఆన్‌లైన్‌లో లభ్యమవుతుందని తెలిపింది.

ట్రాక్టర్ అమ్మకాల్లో పతనం

చెన్నయ్ : దేశీయంగా ట్రాక్టర్ అమ్మకాల్లో పతనం చోటు చేసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గడంతో ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన ఏప్రిల్‌లో ట్రాక్టర్ విక్రయాలు 11 శాతం క్షీణించి 79,288 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. 2012 ఇదే మాసంలో 89,201 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. 2023 మార్చిలోనూ 82,856 యూనిట్ల అమ్మకాలు జరగ్గా.. దీంతో పోల్చిన గడిచిన నెల డిమాండ్‌లో తగ్గుదల చోటు చేసుకుంది. 2023 ఏప్రిల్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ అమ్మకాలు 10 శాతం తగ్గి 35,938 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఎస్కార్ట్స్ కుబోటా ట్రాక్టర్ల అమ్మకాలు 5.5 శాతం తగ్గి 7,252 యూనిట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్ పరిశ్రమ ఒక్క అంకె వృద్ధితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేలా ఉందని ఆ రంగం వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మళ్లీ బెస్ట్ అవైలబుల్ పథకం

- 2025లో మెగా డిఎస్‌సి, ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ : నారా లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



ఎస్‌సి సామాజిక వర్గ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న నారాలోకేష్

టిడిపి అధికారంలోకి రాగానే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని మళ్లీ ప్రవేశపెడతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలో సాగింది. బన్నూరు శివారు విడిది కేంద్రం నుంచి పాదయాత్ర పాములపాడు మీదుగా శ్రీశైలం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పాములపాడులో ఎస్‌సి సామాజిక తరగతి నాయకులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి దళితుల పథకాలను 27 రద్దు చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక దళితులకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించి, ఖర్చు చేస్తామన్నారు. 2025 జనవరిలో మేం మెగా ఎస్‌సి ప్రకటిస్తామని, ఐదేళ్లలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్సూరెన్సు భారాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గతంలో 2.70 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించామని, ఈసారి ఐదు లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. దళితులకు 200 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. శ్రీశైలం ముంపు బాధితులను ఆదుకుంటామని, జిఒ 98ను అమలు చేస్తామని తెలిపారు. తాము దళితులకు ఏం చేశామో, జగన్మోహన్‌రెడ్డి ఏం చేశారో చర్చించడానికి సిద్ధమని, సాంఘిక సంక్షేమ మంత్రి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. అసైన్డ్ ల్యాండ్ చట్టంపై రాష్ట్రంలో ఇంకా సందిగ్ధత నెలకొందన్నారు. కర్ణాటకలోని చట్టాన్ని అధ్యయనం చేసి త్వరలో మంచి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గంలోకి మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ ఇంఛార్జి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. పాదయాత్రలో నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి మాండ్ర శివానందరెడ్డి, కోడుమూరు ఇంఛార్జి ఆకెపోగు ప్రభాకర్ పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రజాస్వామ్యానికి పట్టం!

రోడ్లు, కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సంస్థలను రోడ్‌షోలు, బహిరంగ సభలు లేదా నిరసనల వంటివి కట్టడి చేయడానికి ప్రభుత్వం జనవరి 2న జారీ చేసిన జీవో నెంబర్ 1ని రద్దు చేస్తూ శుక్రవారంనాడు రాష్ట్ర హైకోర్టు తీర్పునివ్వడం హర్షణీయం. ఈ జీవో ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉందని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పడం రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయ వేయడమే! ప్రభుత్వ విధానాలవల్ల నష్టపోయిన వర్గాలు, తరగతుల ప్రజానీకం నిరసనలు, ఉద్యమాలు సాగించడానికి ఈ తీర్పు దోహదపడుతుంది. 'విపక్షాలు కార్యక్రమాలను నిర్వహించకుండా జీవో 1ను జారీ చేశారని, దాన్ని కొట్టేయకపోతే భవిష్యత్‌లో ప్రతిపక్షాల నేతలు రోడ్లపై కార్యక్రమాలను నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందన్న' పిటిషనర్ల వాదనను ఆమోదించి హైకోర్టు ప్రజాస్వామ్యానికి, ప్రజాతంత్ర హక్కులకు పట్టం కట్టింది. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఉండగా జీవో నెం 1 జారీ చేయాల్సిన అవసరం ఏముందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించడం సర్కారు చేసినది కుయత్నమని చెప్పడమే! ఈ జీవో వల్ల ర్యాలీలు, ధర్నాలు, రోడ్‌షోల నియంత్రణ చేసే అధికారం పోలీసుల నుంచి ప్రభుత్వానికి మారిపోతుందన్న పిటిషనర్ల తరఫు వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పోలీసులకు ఆదేశాలిచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేయడం ద్వారా ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికీ సంబంధించిన లక్ష్మణరేఖను కూడా గుర్తు చేసింది.

జీవో నెం 1 జారీ చేయడం మొదలు దానిని ఆగమేఘాల మీద అమలు చేయపూనుకోవడమేగాక ఆ క్రమంలో సుప్రీం కోర్టు గడప తొక్కడం వరకూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి వివాదాస్పదంగా ఉంది. జీవో ను సవాల్ చేస్తూ టిడిపి, సిపిఐ, ఇంకొన్ని ప్రజాసంఘాల నాయకులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి దాన్ని నిలిపివేస్తూ స్టే ఆదేశాలిచ్చింది. అప్పుడైనా ప్రభుత్వం సంయమనం పాటించకుండా మధ్యంతర ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ జరిపి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో రాష్ట్ర హైకోర్టు వ్యాజ్యాలపై సమగ్ర విచారణ పూర్తి చేసి జనవరి 24న రిజర్వులో పెట్టిన తీర్పును శుక్రవారంనాడు వెలువరించింది. తుదకు సర్కారుకు మొట్టికాయ పడింది. జీవో నెంబరు 1కి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తినా ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడకుండా మరింత పటిష్టంగా జీవోను అమలు చేయాలని చూడడం క్షంతవ్యం కాదు. ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనల పేరుతో అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విపరీతంగా పెరిగిపోయాయి. పోలీసు స్టేషన్లలో ఆయా సంఘాలు, పార్టీల నాయకులనేగాక కుటుంబ సభ్యులను సైతం నిర్బంధించడం అమానుషం. రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాసంఘాల భారీ కార్యక్రమాలే కాదు చీమ చిటుక్కుమన్నా జీవో నెంబరు 1ని ఓ ఆయుధంలా వినియోగించి నిరసన గొంతులను నొక్కేయడం దారుణం.

ఏది ఏమైనా కందుకూరు, గుంటూరుల్లో నిర్వహించిన సభల్లో తొక్కిసలాటలు, అమాయక ప్రజల ప్రాణాలు పోయిన నేపథ్యంలో ప్రజాహితం కోసమే జీవో నెం 1ని జారీ చేశామని చెప్పిన ప్రభుత్వ వాదనను హైకోర్టు తిరస్కరించింది. బ్యానర్లు, ఫ్లెక్సీలు వంటివి కూడా ఏర్పాటు చేయడానికి వీల్లేదనే షరతు కూడా జీవోలో ఉందని ఆక్షేపించింది. సభలు, సమావేశాలను నిర్వహించేందుకు పార్టీలకు అధికారం ఉంటుందని, వాటికి భద్రత కల్పించాల్సింది పోలీసులేనని కుండ బద్దలు కొట్టింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పోకడలు విడనాడి పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు నిరసన తెలిపే హక్కును నిరాకరించడం చెల్లదు. హైకోర్టు తాజా తీర్పుతో అది మరోసారి రుజువైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇపుడైనా విజ్ఞతతో వ్యవహరించాలి.

మహనీయుని మాట

ఓటు హక్కు ఎంత గొప్ప ఆయుధమో మీరు ఎప్పుడైనా గమనించారా? ప్రజలు దీన్ని ఉపయోగించుకోవాలి. విప్లవం కన్నా ఇది చాలా నెమ్మదిగా జరిగే ప్రక్రియ. కానీ పది రెట్లు ఎక్కువగా నమ్మదగిన ప్రక్రియ.

\- ఫ్రెడరిక్ ఏంగెల్స్

అంతర్జాతీయం

పెరుగుతున్న చైనా పలుకుబడి- తగ్గుతున్న అమెరికా పెత్తనం !

ఎం.కె.ఆర్

> చైనా నిజంగా సూడాన్‌లో వైరి పక్షాల మధ్య రాజీ కుదుర్చుతుందా లేదా అన్నది అనేక అంశాల మీద ఆధారపడి ఉంది. సంక్లిష్టత రీత్యా అది అంత తేలిక కాకపోవచ్చు. సూడాన్ పరిణామాలను గమనించినపుడు అక్కడ భద్రతా దళాల మధ్య హింసాకాండ ప్రబలటమే అమెరికా పెత్తనం దిగజారుడుకు ఒక నిదర్శనం అని, అది ఇటీవల జరుగుతున్న పరిణామాల్లో భాగమే అని కొందరు చెబుతున్నారు. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అన్నట్లుగా అమెరికా, దాని అనుచరులుగా ఉన్న ఇతర పశ్చిమ దేశాల ప్రమేయం లేకుండా ప్రపంచంలో ఏదీ జరగదని బలంగా ఉన్న నమ్మకం సడలుతున్నది. ఈ దేశాల నేతలు ఊహించని పరిణామాలు చోటు చేసుకోవటం, అవి పెద్దన్న అమెరికా ప్రమేయం లేకుండా జరగటం పెద్ద చర్చగా మారింది.

ఆఫ్రికాలోని కీలక దేశమైన సూడాన్‌లో పారా మిలిటరీ-మిలిటరీ మధ్య కానసాగుతున్న అంతర్యుద్ధంలో ఇప్పటి వరకు ఆరు వందల మందికి పైగా మరణించగా ఐదు వేల మంది గాయపడినట్లు వార్తలు. గురువారం నాటికి 27 రోజులుగా ఘర్షణ సాగుతోంది. అమెరికా మార్గదర్శకత్వంలో సూడాన్ మిలిటరీ-పారామిలిటరీ మధ్య రంజాన్ మాసంలో కుదిరిన ఒప్పందాలు విఫలమయ్యాయి. దీంతో అక్కడ శాంతి, భద్రతలు భగ్నం కావటానికి కారకులైన వ్యక్తుల మీద ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ప్రకటించాడు. తరువాత వైరి పక్షాల మధ్య రాజీ కుదిర్చేందుకు చైనా రంగంలోకి దిగుతుందా అన్న చర్చ మొదలైంది. మిలిటరీకి అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతు ఉండగా పారామిలిటరీకి పశ్చిమాసియా, మధ్యప్రాచ్యం లోని కొన్ని దేశాల మద్దతు ఉంది. సంక్లిష్టమైన ఈ వివాదంలో చైనా ఏ పక్షమూ వహించటం లేదన్న ఒక్క సానుకూల అంశం తప్ప సయోధ్య కుదుర్చటం, కుదరటం అన్నది అంత తేలిక కాదు. ఆఫ్రికా సమస్యలను ఆఫ్రికాయే పరిష్కరించుకోవాలి అన్న ఆఫ్రికా యూనియన్ వైఖరిని గౌరవిస్తున్న చైనా ఏ దేశ వివాదంలోనూ ఒక పక్షం వైపు మొగ్గలేదు.

ఆఫ్రికాలో పశ్చిమ దేశాల భూ సంబంధ రాజకీయాలకు బలైన దేశాల్లో సూడాన్ ఒకటి. బ్రిటీష్ వలస పాలన నుంచి 1956లో విముక్తి పొందిన తరువాత అక్కడ శాంతి లేదు. అంతకు ముందు ఈజిప్టు ఆక్రమణలో తరువాత బ్రిటీష్ ఏలుబడిలో ఉన్నపుడు దక్షిణ, ఉత్తర సూడాన్ ప్రాంతాలుగా ఉంది. బ్రిటీష్ వారు వైదొలగుతూ ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా రెండు ప్రాంతాలను ఒకే దేశంగా చేశారు. అప్పటి నుంచి దక్షిణ సూడాన్ పౌరులు ప్రభుత్వంలో తమ ప్రాతినిధ్యం పెరగాలని, తమ ప్రాంతానికి స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. అందుకు నిరాకరించటంతో అంతర్యుద్ధం ప్రారంభమైంది. మధ్యలో పది సంవత్సరాలు తప్ప 1956 నుంచి 2005 వరకు అది కొనసాగి ఐదు నుంచి పది లక్షల మంది ప్రాణాలు తీసుకుంది. 2011లో దక్షిణ సూడాన్ స్వతంత్ర దేశంగా అవతరించింది. అవిభక్త సూడాన్‌లో, తరువాత పదకొండు మిలిటరీ కుట్రలు, తిరుగుబాట్లు జరిగాయి. అంతర్యుద్ధంలో పాలకులు కిరాయి మూకలను సమీకరించి డార్ఫర్, ఇతర ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాన్ని అణచివేశారు. తరువాత వాటిని 2013లో పారామిలిటరీగా మార్చారు. ఇటీవలి అధికార పంపిణీలో మిలిటరీ నేత, పారామిలిటరీ నేతలు ఇద్దరూ ఒకరి తరువాత ఒకరు అధికార వ్యవస్థను ఆక్రమించారు. పారామిలిటరీని మిలిటరీలో ఎప్పుడు విలీనం కావించాలన్న అంశంపై ఒప్పందానికి భిన్న భాష్యాలు చెప్పి అధికారం కోసం జరిగిన కుమ్ములాటల కారణంగా రెండింటి మధ్య అంతర్యుద్ధం మొదలైంది. జనం నలిగిపోతున్నారు. అణచివేతలో ఇద్దరూ ఇద్దరే.

సూడాన్‌లో వర్తమాన పరిణామాలను చూస్తే ఏడు లక్షల మంది పౌరులు నిర్వాసితులైనట్లు ఐరాస సంస్థ వెల్లడించింది. రాజధాని ఖార్టూమ్ పరిసర ప్రాంతాల మీద విమానదాడులు కొనసాగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాలన్నీ ఖాళీగా ఉన్నాయి. మరోవైపు అమెరికా-సౌదీ ప్రతిపాదన మేరకు సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో మిలిటరీ-పారా మిలిటరీ ప్రతినిధుల మధ్య తొలిసారిగా ముఖాముఖీ కాల్పుల విరమణ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. సూడాన్ లోని అనేక ప్రాంతాల్లో ఆకలి కేకలు ప్రారంభమైనట్లు వార్తలు. బ్యాంకులు, ఏటిఎంలు పని చేయటం లేదు. చమురు కొరత, ధరల పెరుగుదలతో జనం సతమతమౌతున్నారు. రాజధానిలో ఎక్కువ ప్రాంతాలు పారా మిలిటరీ ఆధీనంలో ఉన్నాయి. వారిని దెబ్బతీసేందుకు మిలిటరీ వైమానిక దాడులు జరుపుతున్నది. రాజధానిలో కాల్పుల విరమణకు పారామిలిటరీ (ఆర్ఎస్ఎఫ్) అంగీకరించకుండా ఒప్పందం కుదిరే అవకాశం లేదని మిలిటరీ అధికారి అల్ బుర్హాన్ చెప్పాడు. ఆర్ఎస్ఎఫ్ పౌరులను రక్షణగా చేసుకుందని, సేవా కేంద్రాలను ఆక్రమించిందని ఆరోపించారు. విమానాలను కూల్చివేసేందుకు పారా మిలిటరీ క్షిపణులను సంధిస్తున్నట్లు వార్తలు.

చైనా నిజంగా సూడాన్‌లో వైరి పక్షాల మధ్య రాజీ కుదుర్చుతుందా లేదా అన్నది అనేక అంశాల మీద ఆధారపడి ఉంది. సంక్లిష్టత రీత్యా అది అంత తేలిక కాకపోవచ్చు. సూడాన్ పరిణామాలను గమనించినపుడు అక్కడ భద్రతా దళాల మధ్య హింసాకాండ ప్రబలటమే అమెరికా పెత్తనం దిగజారుడుకు ఒక నిదర్శనం అని, అది ఇటీవల జరుగుతున్న పరిణామాల్లో భాగమే అని కొందరు చెబుతున్నారు. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అన్నట్లుగా అమెరికా, దాని అనుచరులుగా ఉన్న ఇతర పశ్చిమ దేశాల ప్రమేయం లేకుండా ప్రపంచంలో ఏదీ జరగదని బలంగా ఉన్న నమ్మకం సడలుతున్నది. ఈ దేశాల నేతలు ఊహించని పరిణామాలు చోటు చేసుకోవటం, అవి పెద్దన్న అమెరికా ప్రమేయం లేకుండా జరగటం పెద్ద చర్చగా మారింది. ఇరాక్ మీద దాడి చేసి అమెరికా చేతులు కాల్చుకుంది. ఇప్పుడు అక్కడ అమెరికా పలుకుబడి ఎంత అన్నది ప్రశ్నార్థకం. తరువాత ఆఫ్ఘనిస్తాన్ నుంచి అవమానకరంగా తాలిబాన్లకు సలాం కొట్టి బతుకు జీవుడా అంటూ ఎక్కడి ఆయుధాలను అక్కడే వదలి కట్టుబట్టలతో అమెరికా మిలిటరీ పారిపోవటం తెలిసిందే. అది శిక్షణ ఇచ్చిన మిలిటరీ కూడా అమెరికాను ఆదుకోలేకపోయింది. దీని అర్ధం అమెరికా కథ ముగిసినట్లు కాదు.

రెండు ప్రపంచ యుద్ధాల్లో మిగతా దేశాలతో పోల్చితే అమెరికా లాభపడింది తప్ప నష్టపోయింది లేదు. తిరుగులేని మిలిటరీ, ఆర్థిక శక్తిగా ఎదిగింది. ఐరోపా పునరుద్ధరణ పేరుతో 13 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టి నాటో మిలిటరీ కూటమి పేరుతో ఐరోపాను తన చక్రబంధంలో బిగించుకుంది. ఇతర ఖండాలను కూడా తన కౌగిలిలోకి తెచ్చుకొనేందుకుగాను 80 దేశాలలో 800 మిలిటరీ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంది. అట్లాంటిక్ సముద్రంలో ఆరవ నౌకాదళాన్ని, పసిఫిక్-హిందూ మహా సముద్రంలో సప్తమ నౌకాదళం, పర్షియన్ గల్ఫ్‌లో పంచమ నౌకదళాన్ని మోహరించింది. అంటే అన్ని ఖండాల చుట్టూ త్రివిధ దళాలను మోహరించింది. దానికి గాను రకరకాల సాకులు చెబుతున్నది. ఇదంతా ఒక్క ముక్కలో చెప్పాలంటే కమ్యూనిజం, దానికి ఆలవాలంగా ఉన్న పూర్వపు సోవియట్, వర్తమాన సోషలిస్టు చైనా, ఇతర సోషలిస్టు దేశాల పలుకుబడిని నిరోధించేందుకు అని ప్రపంచాన్ని నమ్మించింది. ఇంతటి శక్తి కలిగి ఉండి కూడా 1960,70 దశకాల్లో వియత్నాం కమ్యూనిస్టు మిలిటరీ, గెరిల్లాల చేతుల్లో చావుదెబ్బతిన్నది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాను పెంచి పోషించిన తాలిబాన్ల చేతుల్లో అవమానాలపాలైంది. ఇప్పుడు ఉక్రెయిన్లో అక్కడి మిలిటరీ, కిరాయి మూకలకు ఆయుధాలు అందిస్తూ పరోక్షంగా పోరు సాగిస్తున్నది. అదే చైనాను చూస్తే ఆఫ్రికాలోని జిబౌటీలో అనేక దేశాలతో పాటు తాను కూడా ఒక సైనిక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇదిగాక మయన్మార్ బంగాళా ఖాతంలోని కోకో దీవుల్లో, సంకేతాలను పసిగట్టే ఒక కేంద్రాన్ని, తూర్పు తజికిస్తాన్, లావోస్, దక్షిణ చైనా సముద్రంలో ఒక ఆరు చిన్న మిలిటరీ పోస్టులను ఏర్పాటు చేసింది. అమెరికా తన మిలిటరీని చూపి ప్రపంచాన్ని భయపెడుతుంటే చైనా తన దగ్గర ఉన్న మిగులు డాలర్లను ప్రపంచంలో వివిధ దేశాల్లో మౌలిక సదుపాయాలు, ఇతర పథకాల మీద ఖర్చు పెడుతున్నది, రుణాలు ఇస్తున్నది.

ఆర్థిక, మిలిటరీ, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో ఎంతో ముందున్న తమ దేశం క్రమంగా తన పలుకుబడిని ఎందుకు కోల్పోతున్నదనే చర్చ అటు అమెరికాలోనూ ఇటు ప్రపంచంలోనూ రోజు రోజుకూ బలపడుతున్నది. సోవియట్ కూలిపోయి, కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గగానే చరిత్ర ముగిసింది, పెట్టుబడిదారీ విధాన ప్రవాహానికి ఎదురు లేదు, ప్రచ్ఛన్న యుద్ధంలో తమదే గెలుపు అని అమెరికా ప్రకటించుకున్న తరువాత గడచిన మూడు దశాబ్దాల్లో చరిత్ర వేరే విధంగా నమోదౌతున్నది. అమెరికా విధాన నిర్ణేతలు, వ్యూహకర్తలు కలలో కూడా ఊహించని పరిణామాలు జరుగుతున్నాయి. అమెరికా ఆటకు అనుగుణంగా చైనా నడుచుకుంటుందని భావించి 1970 దశకంలో దాన్ని అసలైన చైనాగా గుర్తించారు. తరువాత 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థలోకి అనుమతించారు. అప్పుడు చైనా విదేశీ మారక ద్రవ్య నిల్వలు కేవలం 200 బి.డాలర్లు మాత్రమే, అవి 2023 జనవరి నాటికి 3,379 బి.డాలర్లకు చేరాయి. ఇంత భారీ మొత్తం ఉంది కనుకనే అనేక దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు చైనాకు అవకాశం వచ్చింది. వాటి కోసం మొహం వాచి ఉన్న దేశాలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. వందల కోట్ల డాలర్లను పెట్టుబడులు, అప్పుగా తీసుకుంటున్నాయి. ఎక్కడా మిలిటరీ కేంద్రాలను పెట్టటం లేదు గనుక దాని మీద అనుమానాలు కూడా లేవు. ఇస్లామిక్ దేశాల మధ్య షియా-సున్నీ విభేదాలను రెచ్చగొట్టి అన్ని దేశాలను తన అదుపులో ఉంచుకోవాలని చూసింది. చివరికి దానికి కూడా తెరపడింది. షియా ఇరాన్-సున్నీ సౌదీ అరేబియాలను చైనా దగ్గరకు చేర్చింది. ఆ ప్రాంతంలో కొనసాగుతున్న ఘర్షణలకు తెర పడేందుకు ఆ ఒప్పందం దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ప్రాంతీయ, దేశాల అంతర్గత వివాదాలకు దూరంగా ఉండటమే చైనా పలుకుబడిని పెంచుతున్నవాటిలో ఒకటి.

నాటోలో భాగంగా అమెరికాతో స్నేహం చేస్తూనే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఇటీవలి బీజింగ్ పర్యటనలో మాట్లాడిన తీరు అమెరికాను బిత్తరపోయేట్లు చేసింది. తన వెనుక ఉన్న వారు ఎప్పుడేం చేస్తారో అన్న అనుమానాలను పెంచింది. తైవాన్ అంశంపై అమెరికా బాటలో నడిచేది లేదని, చైనాతో వ్యూహాత్మక భాగస్వామ్య కలిగి ఉంటామని మాక్రాన్ చెప్పాడు. వందల కోట్ల లాభదాయక ఒప్పందాలను ఫ్రెంచి కంపెనీలకు సాధించటంలో మాక్రాన్ చొరవ చూపాడు. ఒక్క ఫ్రాన్సే కాదు జర్మనీ వైఖరి కూడా అలానే ఉంది. డాలరు పెత్తనానికి తెరదించాలన్న అభిప్రాయం రోజు రోజుకూ బలపడుతున్నది. నిజానికి అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తూ అమెరికా దాన్ని ముమ్మరం చేస్తున్నది. మొత్తం మీద చూసినపుడు నూతన ప్రపంచ వ్యవస్థ రూపుదిద్దు కుంటున్నది. అది అమెరికా-పశ్చిమ దేశాల కేంద్రంగా జరగటం లేదు. ఏక ధ్రువ కేంద్రానికి బదులు రెండు లేదా అంతకు మించి ఎక్కువ అధికార కేంద్రాలున్నపుడు దేశాలకు ఎంచుకొనే అవకాశాలు పెరుగుతాయి.

'సాయుధ వివాదాన్ని మరింతగా కొనసాగించటంలో రెండు శక్తులకు పరస్పర ప్రయోజనం ఉంది, దీన్ని సాకుగా చూపి పౌరశక్తులకు అధికారాన్ని బదలాయించకుండా చూస్తున్నాయని' సూడాన్ కమ్యూనిస్టు పార్టీ విదేశాంగ వ్యవహారాల కార్యదర్శి సాలె మహమ్మద్ సూడాన్ పరిణామాలపై చెప్పారు. ఈ వివాదంలో ఆర్ఎస్ఎఫ్‌కు మద్దతు ఇవ్వటం ద్వారా ఎఫ్ఎఫ్‌సి కూటమి తన విశ్వసనీయతను కోల్పోయిందని గతంలో ఆ సంస్థలో ఒక ప్రధాన భాగస్వామిగా ఉండి తరువాత వెలుపలికి వచ్చిన కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే విప్లవ కార్యాచరణకు తిరిగి ఉపక్రమించటం, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచటం తప్ప మరొక మార్గం లేదని కూడా పేర్కొన్నది. ★

విశ్లేషణ

మతోన్మాద ముసుగును తొలగిద్దాం

> ఈ తరుణంలో, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాల దాడి, సామ్రాజ్యవాద ఆధిపత్య వాదానికి వ్యతిరేకంగా మన గొంతును వినిపించడంలో ఏమాత్రం విఫలం కాకూడదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గం ఈ దారుణమైన దాడులను పోరాటాల ద్వారా ఎదుర్కొంటున్నది. కార్మికుల హక్కులు, జాతీయ సార్వభౌమాధికారంపై జరిగే దాడులతో సామ్రాజ్యవాద ఆధిపత్య దాడులకు గల సంబంధాన్ని బహిర్గతం చేయాలి.

కె.ఎన్. ఉమేష్

శ్రామిక ప్రజల మనస్సులలోకి చొరబడుతున్న మతతత్వ విభజిత శక్తుల విషపూరిత దాడి కార్మికవర్గ ఐక్యతకు ఒక పెద్ద సవాలుగా మారింది. మతతత్వ శక్తుల ఈ కుట్రపూరిత చర్యలు కార్మికులు, సామాన్య ప్రజలపై హిందుత్వ సైద్ధాంతిక ప్రభావాన్ని తీవ్రంగా వేస్తున్నాయి. నిజానికిదంతా కార్పొరేట్లు, మతశక్తులు కుమ్మక్కై నయా ఉదారవాద విధానాల ద్వారా కార్మిక వర్గ, సామాన్య ప్రజల హక్కులు, జీవితాలపైన, జీవనోపాధి పైన నిరాఘాటంగా దాడి జరపటానికి వేసుకున్న ముసుగు మాత్రమే.

అందువల్ల మతోన్మాద భావజాలానికి, సమాజంపై దాని విషపూరిత దాడికి వ్యతిరేకంగా కార్మికోద్యమం అన్ని స్థాయిల్లో పోరాటాన్ని నిరంతరంగా నిర్వహించాల్సి వుంది. నయా ఉదారవాద విధాన పాలనను ఎదుర్కోవటానికి, ఓడించడానికి చేసే పోరాటంలో వర్గ ఐక్యతను కాపాడుకోవడం, విస్తృతం చేయడం మన కీలకమైన కర్తవ్యం. ప్రత్యేకించి దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం - ఇతర రాష్ట్రాలలోని డబుల్ ఇంజిన్ సర్కార్ల దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు ఇది అత్యవసరం.

బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కార్మికులు పెద్దఎత్తున భాగస్వాములయ్యారు. భారతదేశం అనే ఆలోచన దాని బహుళత్వంతో ఉద్భవించింది. స్వాతంత్ర్యం, సమానత్వం మరియు సౌభ్రాతృత్వం అనే భావనలపై ఆధారపడిన భారత లౌకిక ప్రజాతంత్ర గణతంత్ర రాజ్యాంగం రూపుదిద్దుకుంది. హిందూ మత రాజ్యం అనే సిద్ధాంతం వెనుక ఉన్న ఆర్ఎస్ఎస్, దాని సంస్థలు ఓడిపోయాయి. కానీ ఇప్పుడు అదే అనాగరిక మతతత్వ శక్తులు మన గడ్డపై మళ్లీ పూర్తి స్థాయిలో విజృంభిస్తున్నాయి. ప్రజల మధ్య చిచ్చుపెట్టి విభజించటానికి ప్రయత్నిస్తున్నాయి. దీనిని మనం సమగ్రంగా అర్థం చేసుకోవటంతో పాటు దీనికి వ్యతిరేకంగా పోరాడాలి.

ఈ తరుణంలో, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాల దాడి, సామ్రాజ్యవాద ఆధిపత్య వాదానికి వ్యతిరేకంగా మన గొంతును వినిపించడంలో ఏమాత్రం విఫలం కాకూడదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గం ఈ దారుణమైన దాడులను పోరాటాల ద్వారా ఎదుర్కొంటున్నది. కార్మికుల హక్కులు, జాతీయ సార్వభౌమాధికారంపై జరిగే దాడులతో సామ్రాజ్యవాద ఆధిపత్య దాడులకు గల సంబంధాన్ని బహిర్గతం చేయాలి.

భారతదేశ స్వాతంత్ర్యం యొక్క 75వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భమిది. ఈ సమయంలో దేశ సార్వభౌమాధికారం, భారత ఆర్థిక వ్యవస్థ స్వావలంబన విషయమై పాలనా యంత్రాంగం పూర్తిగా రాజీ పడడాన్ని మనం చూస్తున్నాము. పెట్టుబడిదారీ వ్యవస్థలో కొనసాగుతున్న సంక్షోభం అది మరింత తీవ్రతరం కావడానికి దోహదపడుతోంది. ఫలితంగా పారిశ్రామిక, సేవా రంగాల్లో స్తబ్దత ఏర్పడింది. కార్మికులపై దోపిడీ, ఒత్తిడి పెరుగుతున్నాయి. జాతీయ సగటు వేతనాల వాటా 30 శాతం నుండి 10 శాతానికి తగ్గింది. 30 శాతం అయితే పెట్టుబడిదారుల లాభం 10 శాతం నుండి 39 శాతానికి పెరిగింది.

కార్మికులను తగ్గించడం, ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు వినియోగం పెరగడం కారణంగా ఉపాధి సంబంధాల పునర్నిర్మాణానికి దారితీస్తోంది. నిరుద్యోగం తీవ్రమవుతోంది. సాధారణ ప్రజలపై పరోక్ష పన్నుల భారం పెరుగుతోంది. మౌలిక ఆస్తులు, సహజ వనరులపై భారీ అద్దెలు, పన్నులు విధించబడుతున్నాయి. అదే సమయంలో కార్పొరేట్/పెద్ద వ్యాపారాలపై ప్రత్యక్ష పన్నులను భారీగా తగ్గించడంతోపాటు వివిధ రాయితీలు, మినహాయింపులు ఇవ్వబడ్డాయి. ఇది ఆత్మనిర్భర్ భారత్, ఆజాదీ కా అమత్ మహోత్సవ్, అమత్ కాల్ నినాదాల అసలు స్వరూపం.. 'శ్రమయేవ జయతే' నినాదం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో అపహాస్యం చేయబడుతోంది. రక్షణ దళాల కాంట్రాక్టీకరణ ఒప్పందాలు-అగ్నిపథ్ పథ్ పథకం 'భారత్ మాతా కి జై' నినాదం యొక్క స్వభావానికి అద్దం పడుతోంది.

జాతీయ ఆస్తులను విక్రయించడానికి, ప్రభుత్వ రంగ సంస్థలను, ఆర్థిక సంస్థలను ప్రైవేటీకరించడానికి అన్ని ప్రయత్నాలూ నిరాటంకంగా జరుగుతున్నాయి. నీతి ఆయోగ్ యొక్క ప్రైవేటీకరణ ప్రణాళిక ఫలించలేదు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ క్రోనీలకు అప్పగించడానికి, మొత్తం ఆర్థిక వ్యవస్థపై గుత్తాధిపత్య నియంత్రణతో కార్పొరేట్ వర్గానికి ప్రయోజనం చేకూర్చడం కోసం ఉద్దేశించినదే నేషనల్ మోనటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎమ్‌పి).

కేంద్ర, రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వం

నిరంతర కార్మిక వర్గ ప్రతిఘటన మరియు ధిక్కరణ పోరాటాల కారణంగా 2 నుండి 3 సంవత్సరాలుగా లేబర్ కోడ్‌ల ముసాయిదాను నోటిఫై చేయలేకపోయింది. వ్యక్తిగత కార్మిక చట్టాలకు సవరణల ద్వారా కోడ్‌ల నిబంధనలను అక్రమంగా అమలు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. పారిశ్రామిక ఉపాధి స్టాండింగ్ ఆర్డర్ల చట్టానికి సవరణలు చేయడం ద్వారా స్థిర కాల ఉపాధి, పని గంటలను పెంచడం, ప్రతి త్రైమాసికానికి ఓవర్‌టైమ్ పని గంటల పెంపు, కర్మాగారాల చట్టానికి సవరణల ద్వారా రాత్రి షిఫ్టులలో మహిళా కార్మికులను నియమించడం, 3 షిఫ్టులకు బదులుగా 2 షిఫ్టులు మొదలైన పద్ధతులు ఇప్పటికే కర్ణాటకలో అమలు చేస్తోంది. 200కు పైగా భారీ మరియు 1000 చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చెందిన దాదాపు 10 లక్షల మంది కార్మికులు దీనికి వ్యతిరేకంగా మార్చి 23వ తేదీన ఒక రోజు సమ్మె చేశారు.

ఈ నయా ఉదారవాద విధానాలపై ప్రజల ఆగ్రహాన్ని మళ్లించేందుకు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని జైళ్లలో పెట్టడం, బెయిల్ పొందే అవకాశం లేని అభియోగాలు మోపడం, ఉద్యమకారులను ఆందోళనకారులుగా, దేశద్రోహులుగా చిత్రిస్తూ ప్రచారం చేయడం, రాజ్యంలో అంతర్రాష్ట్ర శత్రుత్వాలు సృష్టించడం వంటివి జరిగాయి. సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, ట్రిపుల్ తలాక్, హిజాబ్, అజాన్, హలాల్, గొడ్డు మాంసం, గోవధ వ్యతిరేక, మత మార్పిడి వ్యతిరేక చట్టాలు, సాధారణ పౌర నియమావళి, రామ మందిర నిర్మాణం, కాశీ, మథుర సమస్యలు, మైనారిటీల హత్యలు, అంజనాద్రి (హనుమంతుని జన్మస్థలం), పాఠ్యాంశాలలో విషపూరిత ద్వేషపూరిత ప్రచారాన్ని నిరంతరంగా వ్యాప్తి చేయడంతో మత విద్వేషాలు వ్యాప్తి చేస్తున్నారు.

కార్పొరేట్-మతతత్వ శక్తుల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త విద్యా విధానం రూపొందించబడింది. అదే సమయంలో భారత రాజ్యాంగ ప్రాథమిక పునాదులకు విరుద్ధంగా హిందూ, హిందీ, హిందుస్తానీ నినాదాలతో గోల్వాల్కర్ కథనాల ఆర్ఎస్ఎస్ భావనకు అనుగుణంగా నిర్దిష్ట సామాజిక ఇంజనీరింగ్ చేయబడింది. వర్ణాశ్రమ ధర్మం, సాంఘిక వివక్ష మరియు అంటరానితనంపై ఆధారపడిన మను స్మృతిని పాలనా విధానంలో చొప్పించటానికి ప్రయత్నం జరుగుతోంది. ఇది దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులు, మహిళలపై పెరుగుతున్న దాడుల ద్వారా వ్యక్తమవుతోంది. ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి, వారి లక్ష్యమైన "హిందూ రాష్ట్ర"ను సాధించడానికి ప్రయత్నిస్తున్నది. జాతీయ-అంతర్జాతీయ కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి, ఆర్ఎస్ఎస్-బిజెపి సన్నిహిత బంధం యొక్క ద్వంద్వత్వం స్పష్టంగా కనిపిస్తున్నది. వర్గ ఐక్యతను దెబ్బ తీసే నయా ఉదారవాద విధానాలను మరింత ముందుకు తీసుకెళుతున్న కార్పొరేట్ కాషాయ దుష్ట కూటమిని ఓడించే స్పష్టమైన లక్ష్యంతో కార్మికులు ముందుకు కదలాలి. ప్రజలు తమ అసలైన శత్రువును గుర్తించి, ప్రజా వ్యతిరేక, దేశ విధ్వంసక పాలనను గద్దె దించేందుకు అవసరమైన ఐక్య పోరాటాన్ని ఉధృతం చేయాలి.

/ వ్యాసకర్త సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు /

కవిత్వం

రైతన్న

మట్టి రేణువులను
అత్తరుగా పూసుకుంటుంటాడు
మట్టి వాసనను
పరిమళంగా ఆస్వాదిస్తుంటాడు
మట్టి నేలను
పూల పాన్పుగా స్వీకరిస్తుంటాడు
మట్టి భూమిని
అన్నపూర్ణగా భావిస్తుంటాడు
తను మట్టిని నమ్ముకుంటూనే
ఎందరినే పల్లకీలను ఎక్కిస్తుంటాడు
ధన దాహంతో
పదవి వ్యామోహంతో
భోగ భాగ్యాల కాంక్షలతో
అర్రులు చాచే
నేటి మనుషులను చూసి
జాలి పడుతుంటాడు
ఎంత తపన పడినా
ఎంత మూటకట్టుకున్నా
పట్టేది జానెడు పొట్టకేనని
గిట్టేది ఆరడుగుల మట్టికేనని
తెలుసుకోలేని
నేటి మనుషులను చూసి
నవ్వేస్తుంటాడు.

\- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
సెల్ : 7780277240

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

ప్రజాశక్తి -చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా, కేర్లపాల్ పోలీస్ స్టేషన్ పరిధి సిరిసిట్టి అటవీ ప్రాంతంలో శుక్రవారం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య భారీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఒక మావోయిస్టు మృతి చెందారు. అనంతరం ఘటనా స్థలంలో పోలీసులు పరిశీలించగా భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, వైర్లు, వాకీటాకీలు లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రాంచీలో షహీద్ మేళా

వేలాది మంది హాజరు

రాంచీ : సుమారు 15 ఏళ్ల విరామం తరువాత జార్ఖండ్‌లో మళ్లీ షహీద్ మేళాను నిర్వహించారు. సిపిఎం రాంచీ జిల్లా కమిటీ ఈ మేళాను పున:ప్రారంభించింది. రాంచీలోని భందులో ఈ నెల 9న జరిగిన మేళాకు వేలాది మంది హాజరయ్యారు. 65 మంది అమరవీరుల కుటుంబ సభ్యులు ఈ మేళాలో పాల్గొని అమరవీరుల వారసత్వాన్ని స్మరించుకున్నారు. అమరవీరుడు గోపాల్ సింగ్ ముండా విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. 1992 ఏప్రిల్ 10న జెఎంఎం గూండాల చేతిలో ముండా దారుణ హత్యకు గురయ్యారు. షహీద్ మేళాలో సిపిఎం జార్ఖండ్ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు ప్రకాశ్ విప్లవ్, సిసి సభ్యులు అవదేశ్ కుమార్, పార్టీ నాయకులు పి.కృష్ణ ప్రసాద్, జెఎస్ మజుందార్ తదితరులు పాల్గొన్నారు.

వివేకా లేఖపై నిన్‌హైడ్రేట్ పరీక్ష

- అనుమతి కోరుతూ కోర్టులో సిబిఐ పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సాంకేతిక ఆధారాలపై సిబిఐ దృష్టి పెట్టింది. వివేకా రాసిన లేఖపై ఎవరెవరి వేలిముద్రలు ఉన్నాయో గుర్తించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. వేలిముద్రలను గుర్తించేందుకు నిన్‌హైడ్రేట్ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నిన్‌హైడ్రేట్ పరీక్షకు అనుమతించాలని కోరుతూ సిబిఐ అధికారులు శుక్రవారం సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నిందితుల అభిప్రాయాలు తెలపాలని కోర్టు ఆదేశించింది. ఈ అంశంపై జూన్ 2న కోర్టు విచారణ జరపనుంది. నిన్‌హైడ్రేడ్ పరీక్ష ద్వారా లేఖపై చేతి రాత, ఇంకు దెబ్బతినే అవకాశం ఉంటుంది. హత్య కేసు విచారణలో లేఖ ఇప్పుడు కీలక సాక్ష్యంగా ఉంది. ఒకవేళ పరీక్షలో లేఖ దెబ్బతిన్నట్లయితే దర్యాప్తు, ట్రయల్‌పై ఇబ్బంది ఉంటుందనే ఉద్దేశంతో సిబిఐ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఒరిజినల్ లేఖ బదులు కలర్ జిరాక్స్‌ను రికార్డులో భద్రపరిచి దాన్ని సాక్ష్యంగా పరిగణించేందుకు అనుమతించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. లేఖపై వేలిముద్రలను అనుమానితుల వేలిముద్రలతో పోల్చాల్సి ఉందని.. నిన్‌హైడ్రేట్ పరీక్షకు అనుమతించాలని కోరారు. వివేకాతో బలవంతంగా లేఖ రాయించినట్లుగా దస్తగిరి వాంగ్మూలంలో పేర్కొన్నారని సిబిఐ కోర్టుకు తెలిపింది.

వారసులకు అందని పోలవరం ప్యాకేజీ

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుండి చిన్నచూపే చూస్తున్నాయి. ప్యాకేజీ, పునరావాసం అమలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వం, మరణించిన నిర్వాసితుల కుటుంబాల వారసులకు పోలవరం ప్యాకేజీ అమలు చేయడం లేదు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అనేక సర్వేలు నిర్వహించి నిర్వాసితులను గుర్తించగా, చివరి గ్రామసభల సమయానికి పిడిఎఫ్ కుటుంబ యజమానులు కొందరు మరణించారు. ఇలా మరణించిన వారి వారసులకు ఆ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా, అది అమలుకు నోచకోవడం లేదు. దీంతో మరణించిన వారి వారసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా సర్వం వదులుకొని పునరావాస కాలనీలకు వెళుతున్న నేపథ్యంలో మరణించిన వారి కుటుంబాల వారసులకు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు, నిర్వాసితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ముంపు గ్రామాల ప్రజల్లో భయాందోళన

గోదావరి వరదల భయం ముంపు గ్రామాల ప్రజలను ఇంకా వీడలేదు. ఇక్కడి నిర్వాసితులను ఎప్పటిలోగా పునరావాస కాలనీలకు పంపుతారో అంతుపట్టని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కూడా వరదలొస్తే మళ్లీ కొండలు, గుట్టల పాలు కావాల్సిందేనా? అంటూ ఆందోళన చెందుతున్నారు. గిరిజన, గిరిజనేతర నిర్వాసితులకు ఏలూరు జిల్లా తాడ్వాయి ప్రాంతంలో పునరావాస కాలనీలు నిర్మించారు. ఇంకా కొన్ని గ్రామాల వారికి ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు.

జ్ఞానవాపి మసీదు కేసు

- రివిజన్ పిటీషన్‌కు హైకోర్టు అంగీకారం

లక్నో : వారణాసిలోని జ్ఞానవాపి మసిదు కేసులో అలహాబాద్ హైకోర్టు శుక్రవారం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మసీదులో శివలింగంగా చెబుతున్న శిల వయసును నిర్ధారించడానికి శాస్త్రీయ సర్వేకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం అనుమతించింది.

ఈ సర్వేను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) చేయాల్సింది. ఈ సంస్థ కోర్టుకు ఇప్పటికే సమర్పించిన అఫిడవిట్‌లో సాంకేతిక కారణాల వల్ల కార్బన్ డేటింగ్ (వయసు నిర్ధారణ పరీక్ష) చేయలేమని తెలిపింది. కొన్ని ఇతర మార్గాలను సూచించింది. శివలింగం వయసును నిర్ధారించడానికి శాస్త్రీయ సర్వేను చేయాలని కోరుతూ హిందూ భక్తులు దాఖలు చేసిన పిటిషన్‌ను వారణాసి కోర్టు గత ఏడాది అక్టోబర్‌లో తిరస్కరించింది. దీంతో పిటీషనర్లు తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ రివిజన్ పిటీషన్‌ను హైకోర్టు అనుమతించింది. మరోవైపు మసీదులో కనుగొన్నది శివలింగం కాదని, ఒక ఫౌంటెన్ అని జ్ఞానవ్యాపి మసీదు నిర్వహణను చూసే అంజుమన్ మసీదు కమిటీ తన వాదనను వినిపిస్తోంది.

మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని జూన్ 2 వరకు పొడిగించారు. ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకె నాగ్‌పాల్ విచారణకు బాధ్యత వహిస్తున్నారు. ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలులో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై సిసోడియాను సిబిఐ అరెస్టు చేసింది. మార్చి 31న సిసోడియా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. మద్యం కేసులో సిసోడియాను ఫిబ్రవరి 26న సిబిఐ అరెస్టు చేసింది.

సచిన్ 'జన సంఘర్ష్' యాత్ర ప్రారంభం

న్యూఢిల్లీ : అసెంబ్లీ ఎన్నికల దిశగా అడుగులు వేస్తున్న రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు సవాల్ విసిరిన సచిన్ పైలట్ 'జన సంఘర్ష్' పాదయాత్రను ప్రారంభించారు. ఆజ్మీర్ నుంచి జైపూర్ వరకూ 125 కిలోమీటర్ల మేర ఈ యాత్ర సాగనుంది. ప్రశ్నాపత్రం లీక్‌తోపాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ పాదయాత్ర చేశారు. ఇది కాంగ్రెస్ ర్యాలీ కాదని, సచిన్ పైలట్ వ్యక్తిగత కార్యక్రమం అని పిసిసి అధ్యక్షుడు గోవింద్ సింగ్ అన్నారు.

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖ కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసుర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత యొక్క పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/భౌతిక స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	మద్దూరి రామ్‌పుల్లయ్య/గల్ల భవాని/ **LBVJW00005361450**	కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రీ, కంకిపాడు మండలం, కంకిపాడు గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియా యొక్క (లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్ లో వివరించిన ప్రకారం ఆర్.ఎస్.నం.182/3 లో ఉన్న రెసిడెన్షియల్ సైట్‌తో కలిసి ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ భవనం విస్తీర్ణం 91 చ.గ.లు. లేదా 76.08 చ.మీ.లు., మూల్యాంకనం నం.783, డో.నం.4-180, హద్దులు: ఉత్తరం: వలి విజయలక్ష్మి మరియు ఇతరుల యొక్క ఆస్తి, దక్షిణం: 24 లింకుల వెడల్పు రోడ్డు, తూర్పు: మోర్ల వీర రాఘవులుకు చెందిన స్థలం, పడమర: వలి విజయలక్ష్మి మరియు ఇతరులకు చెందిన ఆస్తి/ భౌతిక స్వాధీనతా తేది:09.05.2023	30.08.2021 Rs. 20,53,930.00/-	విజయవాడ

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది: 12 మే, 2023 — ఆధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ — ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

స్వాధీనత ప్రకటన

ఈడల్వీస్ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

సిఐఎన్: U67100MH2007PLC174759
రిటైల్ సెంట్రల్ & నమోదిత కార్యాలయం: ఇడెల్వీస్ హౌస్, కార్యాలయం సిఎస్‌టి రోడ్, కలిన, ముంబాయి 400098

ఏదైతే ఇక్కడ పేర్కొన్న సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (యాక్ట్), 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క (రూల్ 3)తో చదువగల సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీత(లు), సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోపు నోటీసులో పేర్కొన్న బాకీపడిన మొత్తం తిరిగి చెల్లించమని కోరుతూ డిమాండ్ నోటీసును జారీచేసియున్నారు.
ఆ తరువాత, సెక్షన్ 5 ఆఫ్ SARFAESI చట్టం, 2002 క్రింద ఇఎఆర్‌సి ట్రస్ట్ వివరాలలో దిగువ పేర్కొన్న వివిధ ట్రస్టుల ట్రస్టీగా దీని సామర్థ్యంలో సొంతంగా/ వ్యవహరిస్తున్నదానిగా ఈడల్వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు సెక్యూర్డ్ క్రెడిటార్స్ ఫైనాన్షియల్ అస్సెట్స్‌ను కేటాయించారు. సెక్యూర్డ్ క్రెడిటార్స్ యొక్క షూస్‌లోకి ఇఎఆర్‌సి అడుగుపెట్టింది మరియు సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అన్ని హక్కులు, టైటిల్ మరియు వడ్డీలు ఆర్థిక ఆస్తులతో పాటు అంతర్లీన భద్రతా వడ్డీలు, హామీలు, తాకట్టుపెట్టినవి రుణగ్రహీత పొందే ఆర్థిక సహాయానికి సంబంధించి ఇఎఆర్‌సిలో ఇవ్వబడ్డాయి మరియు ఇఎఆర్‌సి అన్ని హక్కులను సురక్షిత రుణదాతగా ఉపయోగించుకుంటుంది.
రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకం మొత్తంను తిరిగిచెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, దిగువసంతకందారుడు, ఈడల్వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా ప్రతి ఆస్థి ఎదురుగా పేర్కొన్న సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతని అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థిని స్వాధీనపరుచుకొన్నారు.

క్ర సం.	అసైనర్ పేరు	ట్రస్ట్ పేరు	లోను ఖాతా నంబర్	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత పేర్లు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనత తేది	స్వాధీనం విధానం
1.	ఈడిల్వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్	EARC TRUST SC 451	LVIJSTH00 00028647	శ్రీ. కొత్తూరు కళ్యాణ బాబు ("రుణగ్రహీత") 2. శ్రీమతి.కొత్తూరు నాగమాధురి ("సహ-రుణగ్రహీత")	31.10.2022 and Rs.35,42,967.05	11.05.2023	లాంఛనప్రాయ స్వాధీనం
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
నూజివీడు బ్రాంచి, (బ్రాంచి కోడ్ : 2966)
19-182, యంవిఆర్ ఎన్‌క్లేవ్, హనుమాన్ జంక్షన్ రోడ్,
బాలికల గవర్నమెంట్ హై స్కూల్, నూజివీడు, ఆంధ్రప్రదేశ్ - 521201.

(అనుబంధం iv)
స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు) ((రూల్ 8 (1))

[illegible]

తేది: 11.05.2023 సం/- ఆదీకృత అధికారి,
ప్రదేశం: నూజివీడు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు విడుదల

- 87.33 శాతం ఉత్తీర్ణత

న్యూఢిల్లీ : సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. 87.33 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది ఫలితాలతో పోలిస్తే 5.38 శాతం తగ్గుదల కనిపించింది. 2022లో 92.71 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఫలితాల్లో ఎటువంటి మెరిట్ జాబితాను ప్రకటించడం లేదని సిబిఎస్ఇ అధికారులు ప్రకటించారు. విద్యార్థులకు వారి మార్కుల ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ డివిజన్‌లను ప్రదానం చేసే విధానాన్ని రద్దు చేయాలని సిబిఎస్ఇ బోర్డు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. 'విద్యార్థుల మధ్య అనారోగ్యకరమైన పోటీని నివారించడానికి సిబిఎస్ఇ ఎటువంటి మెరిట్ జాబితాను ప్రకటించదు. వివిధ సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు సాధించిన 0.1 శాతం విద్యార్థులకు బోర్డు మెరిట్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది' అని బోర్డుకు చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఈ ఏడాది ఫలితాల్లో తిరువనంతపురం 99.91 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచింది. తరువాత స్థానాల్లో 98.64 శాతంతో బెంగళూరు, చెన్నై నిలవగా, ఢిల్లీ వెస్ట్ (93.24 శాతం), చండీగఢ్ (91.84 శాతం) నిలిచాయి. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ (78.05 శాతం) అత్యల్ప ఉత్తీర్ణత సాధించింది. మొత్తంగా బాలికలు 90.68 శాతం, బాలురు 84.67 శాతం, ట్రాన్స్‌జెండర్ విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. వచ్చే ఏడాది సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షలు 2024 ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమవుతాయని అధికారులు చెప్పారు.

15 నుంచి ఛత్తీస్‌గఢ్‌లో కాంట్రాక్ట్ కార్మికుల రథయాత్ర

రాయ్‌పూర్ : ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో ఈ నెల 15 నుంచి ఛత్తీస్‌గడ్‌లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు రథయాత్ర నిర్వహించనున్నారు. జూన్ 21 వరకూ ఈ యాత్ర జరగనుంది. 'కాంట్రాక్ట్ రెగ్యులరైజేషన్ రథయాత్ర' పేరుతో ఈ యాత్ర ఛత్తీస్‌గఢ్ ఆల్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకత్వంలో జరగనుంది. రాష్ట్రంలోని 33 జిల్లాల మీదుగా ఈ యాత్ర జరగనుంది. ఆయా జిల్లాలకు చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగులు ఒకరోజు సెలవు తీసుకుని యాత్రలో పాల్గొంటారు. చివరగా రాయ్‌పూర్‌తో ఈ యాత్ర ముగిస్తుంది. అక్కడ భారీ ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యాత్ర తరువాత కూడా తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించపోతే, మరింత పెద్ద ఆందోళన నిర్వహిస్తామని ఫెడరేషన్ హెచ్చరించింది. క్రమబద్ధీకరణపై గతంలో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. 54 ప్రభుత్వ శాఖల్లో సుమారు 45 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీని అమలు చేయలేదని ఉద్యోగులు విమర్శిస్తున్నారు.

క్యూబా, వెనిజులాపై ఆంక్షలు ఎత్తివేయండి

- బైడెన్‌ను కోరిన డెమొక్రాట్లు

వాషింగ్టన్ : క్యూబా, వెనిజులాపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ అమెరికాలోని కాంగ్రెస్ డెమొక్రాట్ల బృందం తాజాగా అధ్యక్షుడు బైడెన్‌కి లేఖ రాసింది. 'ట్రంప్ పరిపాలనా కాలంలో వలసలపై ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు ప్రస్తుత వలసల పెరుగుదలతో ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ పరిపాలనలో ఈ రెండు దేశాలపై విధించిన విచక్షణారహిత ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయడానికి వేగంగా చర్యలు తీసుకోవాలి' అని డెమొక్రాట్ల బృందం బైడెన్‌కి రాసిన లేఖలో పేర్కొంది. ఈ లేఖపై కాలిఫోర్నియాకు చెందిన నానెట్ బర్రాగన్, అరిజోనాకు చెందిన రౌల్ ఎమ్. గ్రిజల్వా, టెక్సాస్‌కు చెందిన గ్రెగ్ కాసర్, న్యూయార్క్‌కు చెందిన అలెగ్జాండ్రియా ఒకాసియో కోర్టెజ్, మిచిగాన్‌కు చెందిన టి. లాయిబ్‌లతో సహా ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు సంతకం చేశారు. ట్రంప్ కాలం నాటి ఇమ్మిగ్రేషన్ పాలసీ ఈ నెల 11తో ముగిసిన నేపథ్యంలో డెమొక్రాట్లు బైడెన్‌కు లేఖ రాశారు.

కుల వివక్ష నిషేధ బిల్లుకు కాలిఫోర్నియా సెనేట్ ఆమోదం

వాషింగ్టన్ : కుల వివక్షను నిషేధించాలని కోరుతున్న బిల్లును చారిత్రక రీతిలో అత్యధిక మెజారిటీతో కాలిఫోర్నియా సెనేట్ ఆమోదించింది. అమెరికాలోనే అత్యంత జనాభా కలిగిన రాష్ట్రమైన కాలిఫోర్నియా కులం ప్రాతిపదికన వివక్షను నిషేధించిన మొదటి రాష్ట్రంగా మారింది. సెనెట్‌కు ఎన్నికైన మొదటి ముస్లిం, ఆఫ్ఘన్ అమెరికన్ సెనెటర్ అయిషా వహాబ్ ఈ బిల్లును గతంలో ప్రవేశపెట్టారు. 34-1 ఓటుతో బిల్లు ఎస్‌బి 403 ఆమోదం పొందింది. వివక్ష వ్యతిరేక చట్టాల్లో కులాన్ని రక్షిత వర్గంలో చేర్చిన మొదటి అమెరికన్ రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. ప్రతినిధుల సభలో కూడా ఇదే తరహాలో బిల్లును ప్రవేశపెడుతున్నామని, ఆ తర్వాత చట్టంగా మారడానికి ముందు గవర్నర్‌కి పంపుతామని బిల్లు ప్రమోటర్లు తెలిపారు.

ఈ బిల్లు, ప్రస్తుతమున్న అన్రుహ్ పౌర హక్కుల చట్టానికి రక్షిత కేటగిరీగా కులాన్ని చేర్చింది. ఈ చట్టం ప్రకారం, కాలిఫోర్నియా ప్రజలందరికీ సమాన, పూర్తి అవకాశాలు, లాభాలు, సదుపాయాలు, హక్కులు, వాణిజ్య సంస్థల్లో సేవలు అన్నీవుంటాయి. కుల వివక్ష కారణంగా హాని పొందుతున్నవారికి ఈ బిల్లు పూర్తిగా రక్షణ కల్పిస్తుంది. కాలిఫోర్నియా సెనెట్ జ్యుడీషియరీ కమిటీ ఏకగ్రీవంగా ఈ బిల్లును ఏప్రిల్‌లో ఆమోదించిన కొద్ది వారాల తర్వాతనే ఈ చారిత్రక బిల్లు వచ్చింది.

అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై
నిపుణుల నివేదిక స్వీకరించిన 'సుప్రీం'

సెబీకి మరో మూడు నెలల గడువు పొడిగింపు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై నిపుణుల కమిటీ నివేదికను అత్యున్నత న్యాయస్థానం స్వీకరించింది. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికపై దర్యాప్తు పూర్తి చేయడానికి గడువును ఆరు నెలలపాటు పొడిగించాలని సెబీ చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. పని చేయడంలో హుషారుగా ఉండాలని తెలిపింది. ఓ బృందాన్ని ఏర్పాటు చేయాలని, ఆగస్టు రెండో వారం తరువాత తదుపరి విచారణ జరుపుతామని, అప్పటికి నివేదికను సమర్పించాలని తెలిపింది. అంటే దర్యాప్తు కోసం గడువును మూడు నెలలు పొడిగించింది.

అదానీ గ్రూప్-హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వివాదంపై దర్యాప్తునకు గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని సెబీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గడువును ఆరు నెలలపాటు పొడిగించలేమని స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ (రిటైర్డ్) ఎఎం సప్రే కమిటీ నివేదిక సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి ఇటీవల చేరింది. ఈ విషయాన్ని ధర్మాసనం తెలిపింది. దీనిపై ఈ కమిటీ చేసిన పరిశీలనలను అధ్యయనం చేసిన తరువాత ఈ నెల 15న విచారణ జరుపుతామని తెలిపింది. దర్యాప్తు కోసం గడువును పొడిగించాలని సెబీ చేసిన విజ్ఞప్తిపై ఆదేశాలను ఈ నెల 15న జారీ చేస్తామని తెలిపింది.

అదానీ గ్రూప్‌పై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. రెండు నెలల్లోగా దర్యాప్తు జరిపి, నివేదికను సమర్పించాలని సెబీని సుప్రీంకోర్టు మార్చిలో ఆదేశించింది. సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఎఎం సప్రే, మాజీ బ్యాంకర్లు కెవి కామత్, ఒపి భట్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, సెక్యూరిటీస్ లాయర్ సోమశేఖర్ సుందరేశన్, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జెపి దేవధర్‌తో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కూడా రెండు నెలల గడువు ఇచ్చింది. సెబీ ఈ నెల 2 నాటికి దర్యాప్తును పూర్తి చేయాల్సుంది. కానీ, ఏప్రిల్ 29న సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో తమకు మరో ఆరు నెలల గడువు కావాలని అడిగింది.

బెంగాల్‌లో 36 వేల టీచర్ల నియామకాలు రద్దు

- కలకత్తా హైకోర్టు ఆదేశాలు
- మరో మూడు మాసాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశాలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌వ్యాప్తంగా గల పాఠశాలల్లోని 36వేల ప్రాథమిక ఉపాధ్యాయుల నియామకాలను శుక్రవారం కలకత్తా హైకోర్టు కొట్టివేసింది. రాష్ట్రంలో జరిగిన ఉద్యోగాలకు నగదు కుంభకోణంపై జరుగుతున్న విచారణలో భాగంగా ఈ నియామకాలను రద్దు చేసింది. స్వతంత్ర భారత చరిత్రలో ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో నియామకాలను రద్దు చేయడం ఇదే ప్రథమంగా కనిపిస్తోంది. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ లేదనే కారణంతో ఈ నియామకాలు రద్దయ్యాయి. 2014 టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో నియమితులయ్యే టీచర్లకు శిక్షణ తప్పనిసరి. అసలు నిర్వహించని ఆప్టిట్యూడ్ పరీక్షల్లో బూటకపు మార్పులు వేయడం ద్వారా శిక్షణ లేని అభ్యర్థులకు నియామకాల కోసం తుది మార్కుల వెయిటేజ్ ఇవ్వడంలో అవకతవకలు జరిగి వుండవచ్చని కోర్టు వ్యాఖ్యానించింది. 2016లో బెంగాల్ ప్రాథమిక విద్యా బోర్డు అనర్హులైన టీచర్లను రిక్రూట్ చేసింది. 2016-17 విద్యా సంవత్సరం నుండి వారు ఉద్యోగాల్లో ఉన్నారు. ఒక్కసారి ఇంత పెద్ద సంఖ్యలో టీచర్లను తొలగించడం వల్ల తలెత్తే సంక్షోభాన్ని, గందరగోళ పరిస్థితులను నివారించే లక్ష్యంతో అనర్హులైన టీచర్లకు నాలుగు మాసాల పాటు ఉద్యోగ పొడిగింపును కోర్టు మంజూరు చేసింది. రాబోయే మూడు మాసాల్లో ఆ ఖాళీలన్నీ భర్తీ చేసే క్రమాన్ని పూర్తి చేయాల్సిందిగా బోర్డును ఆదేశించింది. ఈ పొడిగించిన సమయంలో అనర్హులైన టీచర్లను పారా టీచర్లుగా మాత్రమే పరిగణిస్తారు. వారి వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలు త్వరలో నిర్ణయించబడతాయని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. పూర్తి స్థాయి ప్రైమరీ టీచర్లుగా వారికి వచ్చే వేతనాలకు బదులుగా కొత్త వేతనాలు అమలవుతాయి. అదే సమయంలో అవసరమైన శిక్షణ తీసుకుని నియమితులైన దాదాపు 6,500మంది ప్రైమరీ టీచర్లను కోర్టు కొనసాగించింది.

చట్టబద్ధ ఒప్పందాలను ఉల్లంఘిస్తే నష్టం అపారం !

- హిందూ మహాసముద్ర దేశాల సమావేశంలో జై శంకర్ వ్యాఖ్యలు

ఢాకా : చట్టబద్ధమైన ఒప్పందాలను లేదా దీర్ఘకాలిక ఒప్పందాలను దేశాలు ఉల్లంఘించినప్పుడు విశ్వాసం, నమ్మకానికి కలిగే నష్టం అపారమైనదని విదేశాంగమంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. భారత్‌తో సరిహద్దు ఒప్పందాలను చైనా ఉల్లంఘించడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఆరవ హిందూ మహాసముద్ర దేశాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. లాభదాయకం కాని ప్రాజెక్టుల వల్ల తలెత్తే భరించలేని రుణ భారం పట్ల గణనీయమైన ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. సరిహద్దుకు సంబంధించిన అన్ని సమస్యలను ప్రస్తుతమున్న ఒప్పందాలకు అనుగుణంగా పరిష్కరించుకోవాలని కోరింది. "గత రెండు దశాబ్దాల నుండి మన ప్రమాదం గురించి మనం విస్మరించిన పాఠాలు చాలా వున్నాయి. అపారదర్శకమైన రుణ పద్ధతులను, విపరీతమైన వెంచర్లను, మార్కెట్‌తో సంబంధం లేని ధరల పాయింట్లను మనం ప్రోత్సహించాలనుకుంటే ఇవన్నీ ఎప్పుడో ఒకప్పుడు మనల్ని ఇబ్బందులు పెడతాయి." అని జై శంకర్ పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఆరవ హిందూ మహాసముద్ర దేశాల సమావేశంలో పాల్గొనేందుకు జై శంకర్ ఢాకా వచ్చారు.

ఈ సమావేశానికి మారిషస్ అధ్యక్షుడు పృధ్వీరాజ్ సింగ్ రూపున్, మాల్దీవుల ఉపాధ్యక్షుడు ఫైజల్ నసీమ్, బంగ్లా ప్రధాని షేక్ హసీనా, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మంత్రులు హాజరయ్యారు. గురువారం ఢాకా చేరుకున్న జై శంకర్ ప్రధాని షేక్ హసీనాతో భేటీ అయ్యారు. పరస్పర ప్రయోజనాలు కలిగిన అంశాలపై ఇరువురు మాట్లాడుకున్నారు.

రెజ్లర్లకు విశేష మద్దతు

- 18న దేశవ్యాప్త ఆందోళన : ఆరు సంఘాల ఉమ్మడి పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన మూడు వారాలకు (21వ రోజు) చేరుకుంది.

సిట్ ఏర్పాటు చేశాం : కోర్టుకు ఢిల్లీ పోలీసులు

బ్రిజ్ భూషణ్‌పై మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఢిల్లీ ప్రత్యేక కోర్టుకు తెలియజేశారు. స్టేటస్ నివేదికను దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు ప్రతిస్పందనగా అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ ముందు ఢిల్లీ పోలీసులు నివేదిక సమర్పించారు. "కేసు తీవ్రత దృష్ట్యా సిట్‌ని ఏర్పాటు చేశాం. సిట్ ఈ కేసును దర్యాప్తు చేస్తుంది" అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. ఈ విషయంలో స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు తెలిపారు. కేసు స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని నివేదికను ఎవరితోనూ పంచుకోవద్దని అభ్యర్థించారు. ఈ నివేదికను ఢిల్లీ పోలీసులు సీల్డ్ కవర్‌లో దాఖలు చేశారు. సమర్పణ తరువాత, తదుపరి విచారణను ఈ నెల 27కి కోర్టు వాయిదా వేసింది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా అన్ని సాక్ష్యాలను సేకరించేందుకు ఢిల్లీ పోలీసు బృందం ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, హర్యానాలకు వెళ్లి ఆధారాలను సేకరిస్తుంది.

18న దేశవ్యాప్త ఆందోళన : ఆరు సంఘాల ఉమ్మడి పిలుపు

రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా ఈ నెల 18న దేశవ్యాప్త ఆందోళనకు ఆరు సంఘాలు పిలుపునిచ్చాయి. సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా పిలుపునిచ్చాయి. "జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్ల నిరవధిక ధర్నా కొనసాగుతోంది. నిందితులపై బిజెపి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బ్రిజ్ భూషణ్, సందీప్ సింగ్‌లను అరెస్టు చేయలేదు" అని పేర్కొన్నాయి. 18న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, క్యాండిల్ లైట్ ప్రదర్శనలు చేయనున్నట్లు తపన్ సేన్ (సిఐటియు), విజూ కృష్ణన్ (ఎఐకెఎస్), బి. వెంకట్ (ఎఐఎడబ్ల్యుయు), మరియం ధావలే (ఐద్వా), హిమఘ్నరాజ్ భట్టాచార్య (డివైఎఫ్ఐ), మయూఖ్ బిస్వాస్ (ఎస్ఎఫ్ఐ) శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఇమ్రాన్‌కు రెండు వారాల తాత్కాలిక బెయిల్

- ఆర్మీ చీఫ్ కుట్ర పన్నారన్న ఇమ్రాన్



ఇస్లామాబాద్ : అవినీతి కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు రెండు వారాల పాటు తాత్కాలిక బెయిల్‌ను ఇస్లామాబాద్ హైకోర్టు శుక్రవారం మంజూరు చేసింది. జస్టిస్ మియాంగుల్ హసన్ ఔరంగజేబ్, జస్టిస్ సమాన్ రఫత్ ఇంతియాజ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ అల్‌ఖదీర్ ట్రస్టు అవినీతి కేసును విచారించింది. భద్రతా కారణాల రీత్యా విచారణ రెండు గంటల పాటు ఆలస్యమైందని మీడియా వార్తలు తెలిపాయి. లాయర్ల నినాదాల నేపథ్యంలో న్యాయమూర్తులు కోర్టు రూమ్ వదిలి వెళ్లిపోయారు. శుక్రవారం ప్రార్ధనలు ముగిసిన తర్వాత విచారణ పునరుద్ధరించబడుతుందని తర్వాత న్యాయమూర్తులు ప్రకటించారు. ఇమ్రాన్‌పై వున్న అన్ని కేసులను కలిపివేసి విచారించాల్సిందిగా కోరుతూ ఇమ్రాన్ తరపు న్యాయవాదులు మరో నాలుగు అదనపు అభ్యర్థనలు దాఖలుచేశారు. ఆయనపై గల కేసుల వివరాలను అందజేయాల్సిందిగా అధికారులను ఆదేశించాలని కోరారు. గట్టి బందోబస్తుతో ఇమ్రాన్‌ను కోర్టుకు తీసుకువచ్చారు. పెద్ద సంఖ్యలో పోలీసులు, రేంజర్లు, అధికారులు కోర్టు వెలుపల మోహరించారు. గేటు ఎదురుగా ముళ్ళ కంచె వేయడం టివి పుటేజీల్లో కనిపిస్తోంది. ఇమ్రాన్ పార్టీకే చెందిన మరో ఇద్దరు సీనియర్ నేతలను శుక్రవారం అరెస్టు చేశారు.

నాలుగు రోజుల క్రితమే తన అరెస్టుకు ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ కుట్ర పన్నారని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. బెయిల్ రావడానికి కొద్ది ముందుగా మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఆర్మీ చీఫ్ ఒక్కరే తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, ఆయన చర్యల వల్ల మొత్తంగా ఆర్మీ ప్రతిష్ట దెబ్బతింటోందని అన్నారు. ఇమ్రాన్‌ను వెంటనే విడుదల చేయాలని సుప్రీం ఆదేశించింది కానీ, అవినీతి ఆరోపణల నుండి ఆయనకు ఎలాంటి రక్షణ కల్పించలేదు. మంగళవారం అర్ధాంతరంగా ఆగిపోయిన కార్యకలాపాలను కొనసాగించాల్సిందిగా కోర్టు ఆదేశించింది.

తమ నేతకు మద్దతుగా వేలాదిమంది పాకిస్తానీలు ప్రదర్శనగా రానున్నారని పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) ప్రకటించింది. రాజధానిలో ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు జరగకుండా ఇస్లామాబాద్ పోలీసులు అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు చుట్టుపక్కల ఏరియా అంతా లాక్‌డౌన్ చేయగా, నగరంలో పలు చోట్ల ఖాన్ మద్దతుదారులు, పోలీసుల మధ్య ఘర్షణలు జరిగాయి.

నాల్గవ రోజూ ఇజ్రాయిల్ భీకర దాడులు

- గాజాలో బతుకు భయం భయం
- మరో ఇద్దరు పాలస్తీనీయులు మృతి
- 31చేరిన మొత్తం మృతుల సంఖ్య

గాజా సిటీ : యూదు దురహంకార ఇజ్రాయిల్ వరుసగా నాలుగవ రోజున కూడా గాజాపై భీకర దాడులు సాగించింది. శుక్రవారం జరిపిన దాడుల్లో మరో ఇద్దరు పాలస్తీనీయులు మరణించారు. . దీంతో ఈ నాలుగు రోజుల్లో మొత్తం మృతుల సంఖ్య 31కి చేరింది. ఇజ్రాయిల్ ఇటీవల కాలం జరిపిన అత్యంత క్రూరమైన దాడి ఇదే. ఈ భీకర దాడులతో గాజాలో బీతావహ పరిస్థితి నెలకొంది. చనిపోయినవారిలో పలువురు పిల్లలు వున్నారని గాజా అధికారులు తెలిపారు. మరోవైపు ఇజ్రాయిల్‌కు, ఇస్లామిక్ జిహాద్ మిలిటెంట్ గ్రూప్‌కు మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే దిశగా ఈజిప్ట్ మధ్యవర్తిత్వం నెరుపుతోంది. ఎక్కడ చూసినా సైరన్లు మోగుతున్నాయని, బయటకు వస్తే కాల్పులకు గురవుతారంటూ హెచ్చరికలు వినిపిస్తున్నాయని అల్‌జజీరా తెలిపింది. తక్షణమే ఈ హింస ఆపాలని ఫ్రాన్స్, జర్మనీ, జోర్డాన్, ఈజిప్ట్ డిమాండ్ చేశాయి. బెర్లిన్‌లో సమావేశం అనంతరం జర్మనీ విదేశాంగ మంత్రి అనలీనా బారెబాక్ మాట్లాడుతూ, తక్షణమే ఈ రక్తపాతాన్ని ఆపాలని కోరారు. గాజా శ్రేణిలోని మిలిటెంట్లు ఇప్పటివరకు 500కి పైగా రాకెట్లను ఇజ్రాయిల్‌పై వేశారని అయితే ఎవరూ మరణించలేదని సైన్యం తెలిపింది. వీటిల్లో 368 రాకెట్లు సరిహద్దుల్లో పడగా, 154 రాకెట్లను ఉక్కు డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. మరో 110 రాకెట్లు గాజాలోనే పడిపోయాయని తెలిపింది. ఇజ్రాయిల్ మిలటరీ విమానాలు చక్కర్లు కొడుతున్న ప్రాంతంలో అనేక భవనాలు శిధిలాలుగా మారాయి, గాజాలో దుకాణాలు మూతపడ్డాయి. వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఈ దాడుల్లో తమ మిలటరీ నేతలు నలుగురిని పోగొట్టుకున్నామని ఇస్లామిక్ జిహాద్ తెలిపింది. శుక్రవారం తెల్లవారుజామునే ఆర్మీ, ఇంటెలిజెన్స్ అధికారులతో ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు సమావేశమయ్యారు.

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

- పోలీస్ మృతి, నలుగురికి గాయాలు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. తాజాగా జరిగిన హింసాకాండలో పోలీసు ఒకరు మరణించగా, మరో నలుగురు పోలీసులు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బిష్ణుపూర్ జిల్లా తెరా ఖోంగాఫాంగ్బి వద్ద గురువారం పోలీసులపై తీవ్రవాదులుగా అనుమానిస్తున్న సాయుధులు కాల్పులకు తెగబడటంతో ఈ దుర్ఘటన జరిగింది. దుండగుల కోసం గాలింపు చర్యలు సాగుతున్నట్లు అధికారులు చెప్పారు. తోరిబంగ్ ప్రాంతంలో ఇద్దరిని తీవ్రవాదులుగా అనుమానిస్తున్న వ్యక్తులు అపహరించుకునిపోయారు. ఆహార పదార్థాల కోసం ఇంటి నుంచి బయటికి వచ్చిన వీరిని ఎత్తుకెళ్లారు. మణిపూర్‌కు అత్యవసర సామాగ్రిని తీసుకొస్తున్న వంద ట్రక్కులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆందోళనకారులు అడ్డుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతోనే హింసాకాండ
అధికార బిజెపి ఎమ్మెల్యేల విమర్శలు
కుకిలకు ప్రత్యేక పరిపాలన కావాలని డిమాండ్

మణిపూర్‌లో అల్లర్లకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వమే కారణమని కుకి సామాజిక వర్గానికి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు విమర్శించారు. వీరిలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు అధికార బిజెపికి చెందినవారు కావడం విశేషం. ఈ నెల 3 నుంచి రాష్ట్రంలో కుకిలకు, మైతీలకు మధ్య ఘర్షణలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అధిక సంఖ్యలో ఉన్న మైతీలకు బిజెపి ప్రభుత్వం ఇస్తున్న 'నిశ్శబ్ద మద్దతు'తోనే ఈ ఘర్షణలు జరుగుతున్నాయని ఎమ్మెల్యేలు తెలిపారు. కుకి వర్గానికి చెందిన పది మంది ఎమ్మెల్యేలు హాకోలెట్ కిప్‌గెన్, నగుర్సంగ్లూర్ సనతే, కిమో హోకిప్ హంగ్సింగ్, లెట్‌పో హోకిప్, ఎల్‌ఎం ఖౌటే, లెట్‌జమాంగ్ హెకిప్, చింలుంతగ్, పౌలైనియాల్ హోకిప్, నెంచా కిప్‌గెన్, వుంగ్‌జగైన్ వాల్తే శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. వీరిలో చింలుంతగ్, హంగ్సింగ్ కుకి పీపుల్స్ అలియన్స్‌కు చెందిన వారు కాగా, మిగిలినవారంతా బిజెపి ఎమ్మెల్యేలు.

స్వస్థలాలకు 130 మంది యుపి విద్యార్థులు

అల్లర్లు జరుగుతున్న మణిపూర్ నుంచి ఇప్పటి వరకూ 130 మంది ఉత్తరప్రదేశ్ విద్యార్థులను స్వస్థలాలకు తరలించారు. వీరంతా మణిపూర్‌లో వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్నారు. వీరిని ముందుగా ఢిల్లీకి వివిధ మార్గాల ద్వారా తీసుకొచ్చారు. అక్కడ నుంచి విమానం ద్వారా లక్నోకు తరలించారు. 130 మందిని తరలించడంతో మణిపూర్‌లో ఉన్న రాష్ట్ర విద్యార్థులను తీసుకు రావడం దాదాపు పూర్తయిందని శుక్రవారం ఉత్తరప్రదేశ్ అధికారులు తెలిపారు.

సైబర్ భద్రత, ఆర్థిక భద్రతపై జి 7 దృష్టి

- జపాన్‌లో జరుగుతున్న చర్చలు

నిగతా (జపాన్) : బ్యాంక్ నిర్వహణలు, సైబర్ భద్రత, ఆర్థిక భద్రతకు హామీ కల్పించేందుకు మరింత విశ్వసనీయమైన సరఫరా మార్గాలను నిర్మించడం వంటి అంశాలు ఇక్కడ జరుగుతున్న జి 7 చర్చల ఎజెండాగా వున్నాయి. ఈ ఏడాది జపాన్‌లో జరుగుతున్న సంపన్న దేశాల కూటమి జి 7 సమావేశాల చర్చల్లో ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా రష్యాతో, అలాగే చైనాతో తలెత్తిన ఉద్రిక్తతలు ప్రధానంగా స్థానాన్ని ఆక్రమించాయి. నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను కాపాడేందుకు గానూ చైనా 'ఆర్థిక ఒత్తిళ్లను' నివారించేందుకు గల మార్గాలపై జి 7 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ చీఫ్‌లు చర్చించారు. అయితే చైనా ఈ సమావేశాన్ని తీవ్రంగా విమర్శించింది. జి 7ను కపటత్వం గల గ్రూపు అంటూ విమర్శలు చేసింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ గురువారం మాట్లాడుతూ, అంతర్జాతీయ నిబంధనలు అంటూ జి 7 మాట్లాడుతున్నవి పశ్చిమ దేశాలు వారి సిద్ధాంతాలు, విలువలను అనుసరించి పెట్టుకున్న నిబంధనలు, అవి అమెరికాను అన్నింటికంటే ముందు నిలుపుతాయి అంటూ విమర్శించారు. "అంతర్జాతీయ నిబంధనలకు చైనా కట్టుబడి వుండాలని జి7 డిమాండ్ చేస్తోంది. కానీ అసలు అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించే వారే దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని వాంగ్ విమర్శించారు. చర్చలకు ముందు అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్ మాట్లాడుతూ, చైనా ఆర్థిక పోటీ తత్వాన్ని దెబ్బతీయడం లేదా వారిని ఆర్థికంగా ముందుకెళ్లకుండా నివారించడంపై ఈ చర్చలు దృష్టి కేంద్రీకరించడం లేదని చెప్పారు. ఆర్థిక ఒత్తిళ్లను ఇతర దేశాలపై చైనా ఉపయోగిస్తుందనడానికి ఉదాహరణలు వున్నాయని ఆమె అన్నారు. ఈ తరహా కార్యకలాపాల పట్ల జి 7 ఆందోళన చెందుతోందని, ఇటువంటి వైఖరిని అడ్డుకునేందుకు ఏం చర్యలు తీసుకోగలమనేదే పరిశీలిస్తోందని చెప్పారు. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం కొనసాగించే సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు గల మార్గాలను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

అధికారుల బదిలీలపై సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీవాల్ ప్రభుత్వం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరోసారి కేజ్రీవాల్ ప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఢిల్లీ ప్రభుత్వానికి, లెఫ్టినెంట్ గవర్నర్‌కు మధ్య పాలనా వ్యవహారాల్లో తరచూ వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఎన్నికైన ప్రభుత్వానికే అన్ని అధికారాలు ఉంటాయని తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. సర్వీస్ సెక్రటరీల బదిలీలను కేంద్రం అమలు చేయడం లేదని పేర్కొంటూ ఆప్ ప్రభుత్వం సుప్రీంని ఆశ్రయించింది. దీనిపై వచ్చేవారం విచారణకు బెంచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది ఎఎం సింఘ్వీ (గురువారం)నే సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం కోర్టు ఆదేశాలను ధిక్కరించే అవకాశముందని, అత్యవసరంగా దీనిపై విచారించేందుకు బెంచ్‌ని ఏర్పాటు చేయాలని న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నరసింహాలతో కూడిన ధర్మాసనాన్ని కోరారు. 'మేము ఎవరినీ బదిలి చేయబోమని వారు చెబుతున్నారు. నిన్న కోర్టు ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకుని నేను ధిక్కారణను దాఖలు చేయగలను. దానికి సమయం పడుతుంది. కాబట్టి దయచేసి ఈ విషయాన్ని జాబితా చేయండి' అని పిఎస్ నరసింహాలతో కూడిన ధర్మాసనాన్ని సింఘ్వీ కోరారు. ఢిల్లీ నగరంలో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై ఆప్ ప్రభుత్వానికి అనుకూలంగా గురువారం సుప్రీం తీర్పునిచ్చిన కొన్ని గంటల తర్వాత.. ఢిల్లీ ప్రభుత్వ సేవల విభాగం కార్యదర్శి ఆశిష్ మోరేని కేంద్రం తన పదవి నుంచి తొలగించింది.

నిరంకుశ జిఓ చెల్లదు

(మొదటిపేజీ తరువాయి)

భద్రత కల్పించాల్సింది పోలీసులేనని పేర్కొంది.

వాక్ స్వాతంత్ర్య హక్కు కీలకం

'జిఓ నెంబరు 1 చట్ట విరుద్ధం. భవిష్యత్తులో చట్టానికి అనుగుణంగా మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేయొచ్చు. అయితే, వాక్ స్వాతంత్ర్యపు హక్కు చాలా కీలకమైంది. పోలీస్ చట్టంలోనే ర్యాలీలు, సభల నియంత్రణకు వీలుంది. శాంతిభద్రతలకు విఘాతం వ్యవహారం తలెత్తితే అనుమతి తీసుకోవాలని పోలీస్ చట్టం చెబుతోంది. ఒక నిర్దిష్ట ప్రదేశంలో జరిగిన ఘటన పేరుతో సమావేశం, ర్యాలీ వంటి హక్కును, ఊరేగింపు హక్కును హరించేందుకు వీల్లేదు. చారిత్రకంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా వీధుల్లో సభలు, సమావేశాలు నిర్వహించడం దేశంలో అనాదిగా ఉంది. ఇది రాజకీయ పార్టీల వ్యవహారాల్లో ఎంతో కీలకం. పార్టీల జీవితంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది' అని హైకోర్టు తీర్పులో పేర్కొంది. వెకేషన్ కోర్టులో పిల్‌ను విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు జారీ చేయడాన్ని తప్పుపట్టింది. ప్రభుత్వ విధాన నిర్ణయాలపై వ్యాజ్యాలను వెకేషన్ కోర్టులు విచారణ చేపట్టరాదని తేల్చి చెప్పింది. 'రోస్టర్, సబ్జెక్టులకు చెందిన అశాలపై సిజెకే విచక్షణాధికారాలు ఉంటాయి. ఈ విషయంలో హైకోర్టు రిజిస్ట్రీకి వెకేషన్ కోర్టుల్లో కేసులను విచారించే న్యాయమూర్తులు ఆదేశాలు జారీ చేయరాదు. జిఓ 1పై పిల్‌ను వెకేషన్ కోర్టు అత్యవసరంగా విచారణ చేపట్టడం సరికాదు' అని హైకోర్టు తీర్పులో స్పష్టం చేసింది. 'జిఓ 1 ప్రాథమిక హక్కులను హరించేందుకు దోహదపడేలా ఉంది. సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్ షోలు, పాదయాత్రలను నియంత్రణ చేసే అధికారం మాత్రమే పోలీసులకు ఉంటుంది. జిఓ 1 భావప్రకటనా స్వేచ్ఛను హరించేలా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉంది. రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలను అడ్డుకునేందుకే జిఓ 1 జారీ అయ్యింది. ప్రజా సమస్యలపై ప్రజలకు దూరంగా ఫలానా చోట కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించలేదు. ఇలా చేయడం ప్రజలు గొంతెత్తకుండా చేయడమే. ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించే దుస్థితి ఏర్పడకూడదు' అని పిటిషనర్ల తరపున చేసిన వాదనలకు హైకోర్టు తీర్పుతో బలం చేకూరింది. రోడ్ షోలు, సమావేశాలను నియంత్రించడం లేదని, అనుమతి తీసుకోవడం వల్ల అనేక సమస్యలు ఎదురుకాకుండా చేసేందుకు వీలౌతుందని ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ చేసిన వాదన వీగిపోయింది.

కవిత

మీకోసం

ఉడకబెట్టిన బంగాళాదుంప పేస్ట్‌ను చేతులకు రాసుకుంటే మృదువుగా ఉంటాయి.

జీవన సౌరభం

కలలు చాలామందికి ఉంటాయి. కానీ వాటిని సాకారం చేసుకునేందుకు ప్రయత్నించేవారే విజయం సాధిస్తారు.

బొమ్మరిల్లు



- పచ్చవ బిందు సహస్ర,
5వ తరగతి,
నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలు,
నరసరావుపేట,
పల్నాడు జిల్లా.

వాన

వానలు బాగా పడ్డాయి
పంటలు బాగా పండాయి
కప్పలు బెకబెక అరిచాయి
భూమి ఆనందించింది
ప్రకతి పచ్చగ మొలకెత్తించింది
మొక్కలు ఏపుగ పెరిగాయి
చల్లని గాలులు వీచాయి
ఉరుములు గట్టిగా వచ్చాయి
మెరుపులు మిల మిల మెరిసాయి
వానలు దబదబ కురిసాయి
భూమినంతా తడిపాయి

- చెరుకూరి. కార్తీక
8వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.

'మై ఏఐ టీచర్' యాప్‌తో ...

నేస్తాలు...! మా పేర్లు మంజు, చరణ్. మీకు కొన్ని విషయాలు చెబుదామని వచ్చాం. ప్రస్తుత కాలంలో ఓ విషయాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీషులో చదవడం, రాయడం చాలా మంది విద్యార్థులకు భయం. ఇలాంటి వారిని ప్రోత్సహించి, వారిలో చదువుపై ఆసక్తి పెంచేలా ఓ యాప్ తయారుచేశాం. ఆ యాప్ పేరు 'మై ఏఐ టీచర్'. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో చదవడం, రాయడం సులభతరం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. రెండు సంవత్సరాలు కష్టపడి చేసి రూపొందించాం. మా గురువు డాక్టర్ సంగరాజు భాస్కర్‌రాజు ప్రోత్సాహంతో మేము ఈ యాప్ చేశాం. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

language	भाषा	భాష
home	घर	ఇల్లు
table	मेज	మేజాబల్ల
mother	मां	తల్లి, అమ్మ
white	सफेद	తెలుపు
black	काला	నలుపు

యాప్ వివరాలు

4వ తరగతి విద్యార్థికి సంబంధించిన ఓ సబ్జెక్టులో పాఠ్యాంశాలు 128 పేజీలు ఉంటాయి. ఇందులో 12 వేల పదాలు ఉంటాయి. దీన్ని కుదించి, అనవసరమైనవి మాత్రమే ఉంచుతాం. మరల మరలా దొర్లినవి తీసివేసి, సరైన కొత్త రకపు పదాలను 1200 పదాలకు తీసుకురావడం, 20 పేజీలకు తయారు చేయడం ద్వారా పిల్లలు రోజుకు 50 పదాలు నేర్చుకున్నా... 25 రోజుల్లో పూర్తి సబ్జెక్టును పూర్తి చేయగలరు.

ఇందులో నాలుగు అంశాలు ఉంటాయి. 1.ఉన్నది ఉన్నట్లు చదవడం, 2.వత్తును తీసేసి చదవడం, 3.గుర్తుపట్టి రాయడం, చదవడం, 4.ఎలా రాస్తామో అలా చెప్పడం. ఇందులో ఒక పదానికి సంబంధించి పూర్తి అర్థాన్ని తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలో చెప్పడం, చూపించడం జరుగుతుంది. ఏదైనా అనుమానం ఉన్న పదాన్ని తెలియజేస్తే, దానికి పూర్తి అర్థం చెబుతుంది. ఇంగ్లీషు పేపర్‌ను ఫొటో తీసి యాప్‌లో ఉంచితే తెలుగులో అనువాదం అవుతుంది. ఏ భాషలో కావాలని అడిగితే– ఆ భాషలో చదివి వినిపిస్తుంది. ఇలా ఒక భాష నుంచి మరో భాషకు అనువాదం అవడం, చదివి వినిపించడం తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లోనూ ఉంటుంది.

ప్రస్తుతం ఈ యాప్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు భాస్కర్‌రాజు కృషి చేస్తున్నారు. ఈ సెలవుల్లో ప్రతి ఆదివారం ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవొచ్చు.

- మంజు,
10వ తరగతి

- చరణ్,
బిటెక్, తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఎండల్లోనూ ఇల్లు చల్లగా ...

ఎండలు పెరగడంతో రాత్రివేళ కూడా ఇల్లు వేడిగా ఉంటుంది. ఇల్లు చల్లగా ఉండాలంటే గృహ నిర్మాణ నిపుణులు కొన్ని చిట్కాలు చెబుతున్నారు. అలా చేస్తే ఎసితో పని లేకుండా ఇంటిని చల్లగా ఉంచుకోవచ్చు. సాధారణంగా పైకప్పు, గోడలు గుండా ఇంట్లో వేడి లోపలకి వస్తుంది. ఈ వేడి బయటకు వెళ్లే విధంగా, లోపల ఉన్న వేడి చల్లబడేలా చూడాలంటే ఈ చిట్కాలు పాటిస్తే సరి.

- ఇంట్లో ఉష్ణోగ్రతలు తగ్గించడానికి మొక్కల పెంపకం అద్భుతమైన మార్గం. ఇంటి పైన వీలైనన్ని మొక్కలను పెంచాలి. సూర్య కిరణాలను మట్టి, మొక్కలు గ్రహించి స్లాబ్‌ని చల్లగా ఉంచుతాయి. ఇంటి మీదే కాకుండా ఇంట్లో కూడా ఇండోర్ మొక్కలు పెట్టుకుంటే చల్లగా ఉంటుంది. కలబంద, పామ్, మనీ ట్రీ, స్పైడర్ ప్లాంట్ వంటి మొక్కలు గాలి నుంచి హానికరమైన పదార్థాలను తీసేసి, ఇంట్లో వేడిని తగ్గిస్తాయి.
- వేడి పుట్టించే, రేడియోషన్ కలిగించే వస్తువులు ఇంట్లో లేకుండా చూసుకోవాలి. పైకప్పు, ఇంటి గోడల నుంచి లోపలకి వచ్చిన వేడి బయటకు వెళ్లే విధంగా ప్రతి గదికీ కిటికీలు ఉండాలి. వాటిని సాయంత్రం 5 గంటల నుంచి తెరచి ఉంచాలి.
- ఇంట్లో వస్తువులు చిందర వందరగా ఉండకూడదు. భారీ ఫర్నిచర్ లేకుండా చూసుకోవాలి. వీటి వల్ల హాట్ ఎయిర్ పాకెట్స్ ఏర్పడి ఇంట్లోకి వచ్చిన వేడి బయటకు వెళ్ల కుండా చేస్తాయి.
- వేసవిలో మాత్రం పలుచటి కర్టెన్లను ఉపయోగించాలి. ఇవి తేలికగా ఉండటంతో పాటు.. లోపలికి గాలి ప్రసరించేలా చేస్తాయి. తెలుపు, క్రీమ్, స్కై బ్లూ వంటి తేలికపాటి షేడ్స్ ఉన్న కర్టెన్లు వాడటం మంచిది. ఇవి వేడి గాలిని బయటకు పంపి, ఇంటిని చల్లబరచడంలో సహాయపడతాయి.
- కిటికీలు బయటగానీ, లోపల గానీ చిన్న చిన్న పూల కుండీలను ఉంచాలి. దాంతో లోపలకి వచ్చే వేడి గాలిని గ్రహించి, పొడి గాలిని తేమగా చేయడంలో సహాయపడతాయి.
- వేసవిలో టీవీ, కంప్యూటర్, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్, వ్యాక్యూమ్ క్లీనర్, హీటర్ల వినియోగాన్ని వీలున్న మేరకు పరిమితం చేసుకోవాలి. లేకుంటే వాటిని వాడుతున్నంతసేపూ వేడి వెలువడుతూనే ఉంటుంది. దీంతో ఇంట్లో ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- టెర్రస్‌పై తెల్లటి సున్నాన్ని రెండు పొరలుగా పూతపూయాలి.
- ఎండు వరి గడ్డిని, జమ్ము గడ్డి కట్టలను ఇంటి పైకప్పుపై పేర్చి రోజుకోసారి నీళ్లు చల్లితే వేడి లోపలకి రాకుండా ఉంటుంది.
- పెద్ద పెద్ద కిటికీలు ఉన్న చోట వెదురు తడికలు వేసుకోవాలి. ఇవి వేడిని గ్రహించడమే కాకుండా, ఇంటిని అందంగా కూడా ఉంచుతాయి.
- తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా కిటికీలను, తలుపులను తెరిచి ఉంచాలి.
- ఇంట్లో ఎక్కువ వేడి ఉత్పత్తి అయ్యేది వంట గదిలోనే. వంట గదిలోని వేడి బయటికి వెళ్లిపోయేలా వెంటిలేటర్ ఏర్పాటు చేసుకోవాలి. ఈ వెంటిలేటర్ల కు ఎగ్జాస్టింగ్ ఫ్యాన్లు అమర్చుకోవాలి.
- ఒక ట్రేలో ఐస్ ముక్కలు వేసి, ఫ్యాన్ కింద పెడితే గదిలో చల్లదనం పరచుకుంటుంది. లేదా టబ్బులో చల్లని నీరుపోసి, గది మూలల్లో పెట్టినా గది చల్లబడుతుంది.
- ఇంటి గోడల పక్కన పెద్ద పెద్ద రాళ్లు, సిమెంట్ నిర్మాణాల వంటివి అనవసరంగా ఉంటే వాటిని తొలగించాలి. అవి ఎండను గ్రహించి వేడిని పెంచుతాయి.
- బెడ్స్, సోఫాల మీద మెత్తటి కాటన్ క్లోత్స్‌ను వేయాలి. వేసవి కాలంలో. పాత స్టైల్, కాటన్ పరుపులు వాడటం మంచిది.
- ఇంటి బయట గోడలకు మట్టిని ఒక లేయర్‌గా పూత పూస్తే కఠినమైన వేడిసైతం లోపలకి వెళ్లకుండా ఉండి గది చల్లగా ఉంటుంది.
- ఇంట్లో ఆహ్లాదాన్ని పెంచేలా ఉన్న పెయింటింగ్‌ను గోడకు అమర్చడం మంచిది. వాల్‌స్టిక్కర్లను అతికించుకోవచ్చు. ఇవి కూడా అధిక ఉష్ణోగ్రత వల్ల కలిగే చిరాకును తగ్గించడంలో తోడ్పడతాయి.

ఆడబిడ్డల పరువు కోసం...

జంతర్ మంతర్‌లో రెజ్లర్ల పోరు

ప్రధాని నరేంద్రమోడీతో వినేష్ ఫోగాట్

నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు అందుకుంటున్న సాక్షిమాలిక్

నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న బజరంగ్ పునియా

నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అర్జున అవార్డును అందుకుంటున్న సంగీత పొగాట్

నాడు ప్రశంసలు.. నేడు మాటే కరువు...

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

అంతర్జాతీయ వేదికలపై పోరాడి భారత్‌కు ఒలింపిక్స్‌సహా అనేక పతకాలు తెచ్చిన క్రీడాకారులు న్యాయం కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో 21రోజులుగా పోరాడుతున్నారు. పద్మశ్రీ, అర్జున, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న తదితర అవార్డులను అందుకుని.. క్రీడాలోకానికే వన్నెతెచ్చిన రెజ్లర్లు న్యాయం చేయాలని కోరుతున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ)చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అందు కోసం... ధర్నా శిబిరం వద్ద టెంట్‌లోనే రాత్రింబవళ్లు పోరాడు తున్నారు. జోరు వాన కురిసి వారు విశ్రాంతి తీసుకునే పరిస్థితి కూడా లేకపోవడంతో ఫోల్డింగ్ మంచాలు తీసుకొచ్చేందుకు ప్రయత్నించగా.. దాన్ని సైతం ఢిల్లీ పోలీసులు ఇటీవల అడ్డుకున్నారు. పలువురిని చితకబాదారు. కొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదేశాలకు అనుగుణంగా నడుచుకునే ఢిల్లీ పోలీసులు... కేంద్ర ప్రభుత్వం బ్రిజ్‌భూషణ్‌కు కొమ్ముకాస్తున్న వైఖరి ప్రతినిత్యం కనిపిస్తోంది. 'బేటీ బచావో' నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన మోడీ సర్కారు ఆ బేటీలు నడిరోడ్డుపై చేస్తున్న ఆందోళనను పట్టించుకోకపోవడం ప్రపంచవ్యాప్తంగా ప్రశ్నార్థకమవు తున్నా... ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా... ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం చర్చనీయాంశమవుతోంది. పతకాల కోసం రెజ్లింగ్ బరిలో దిగాల్సిన తాము ఆడబిడ్డల పరువు కోసం దేశ రాజ ధానిలో పోరాడుతున్నామని చెబుతున్న ఈ రెజ్లర్లం దరూ గ్రామీణ ప్రాంతాలనుంచి ప్రపంచస్థాయికి ఎదిగినవారే. వారుసాధించిన పతకాలు, పొందిన అవార్డుల సమాచారం సంక్షిప్తంగా...

బజరంగ్ పునియా : హర్యానాలోని ఝజ్జర్ ప్రాంతానికి చెందిన చెందిన పునియా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు పత కాలు సాధించిన ఏకైక భారతీయ రెజ్లర్‌గా నిలిచాడు. రెజ్లర్ అయిన తండ్రి ప్రోత్సాహంతో స్థానిక మట్టి కుస్తీ పాఠశాలలో చేరాడు. కోచ్ రాంఫాల్ మాన్ శిక్షణలో ఎదిగాడు. ఇండియన్ రైల్వేలో గెజిటెడ్ ఆఫీ సర్ ఒఎస్‌డి స్పోర్ట్స్ పోస్ట్‌లో పనిచేస్తున్నారు. ఆయన భార్య సంగీత.

సాధించిన పతకాలు: 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం ♦ ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో 2018లో రజతం, 2013, 2019లో కాంస్య పతకాలు ♦ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్ షిప్‌లో 2017లో స్వర్ణం, 2014, 2021లో రజతం, 2013లో కాంస్యం ♦ ఆసియా క్రీడల్లో 2018లో స్వర్ణం, 2014లో రజతం ♦కామన్వెల్త్ గేమ్స్‌లో 2018, 2022లో స్వర్ణం, 2014లో రజతం ♦2021లో రోమ్‌లో మాటియో పెల్లికాన్ ర్యాంకింగ్ సిరీస్‌లో స్వర్ణం

అవార్డులు: 2015లో అర్జున, 2019లో పద్మశ్రీ, రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, 2020లో ఎఫ్ఐసిసిఐ ఇండియా స్పోర్ట్స్ అవార్డ్.

నగదు పురస్కారాలు: • 2020 టోక్యో సమ్మర్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నందుకు కేంద్ర ప్రభుత్వం నుండి రూ.30 లక్షలు, హర్యానా ప్రభుత్వంనుండి రూ.2.5 కోట్లు • బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా నుండి రూ.25 లక్షలు
• ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ నుండి రూ.25 లక్షలు

పెదనాన్న శిక్షణలో అంతర్జాతీయ స్థాయికి వినేష్ ఫోగాట్

వినేష్ ఫోగాట్ 1994 ఆగస్టు 25న హర్యానాలో చర్కీ దాద్రీ జన్మించారు. రెజ్లర్ అయిన తండ్రి రాజ్‌పాల్ చిన్నతనంలోనే మరణించారు. వినేష్, ఆమె సోదరి ప్రియాంక పెదనాన్న, ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్ సింగ్ ఫోగాట్ వద్దే పెరిగారు. వినేష్ కజిన్స్ (గీత, బబిత, రీతు, సంగీత) అంతర్జాతీయ రెజ్లర్లు, కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతలు. కామన్వెల్త్, ఆసియా క్రీడలు రెండింటిలోనూ స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా వినేష్ నిలిచారు. ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో అత్యధిక పతకాలు గెలుచుకున్న ఏకైక భారతీయ మహిళా రెజ్లర్ ఆమె. 2018 డిసెంబర్ 13న వినేష్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు సాధించారు. ఆమె భర్త, రెజ్లర్ సోమ్‌వీర్ రాఠీ.

పతకాలు: టోక్యో ఒలింపిక్స్ 2020కి అర్హత సాధించిన తొలి భారతీయ రెజ్లర్♦2019, 2022లో ప్రపంచ రెజ్లింగ్ ఛాంపి యన్ షిప్‌లో కాంస్యం ♦ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో 2018లో స్వర్ణం, 2015లో రజతం, 2014లో కాంస్యం ♦2013, 2019లో ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు ♦2014, 2018, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాలు ♦2013లో కామన్వెల్త్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజతం ♦రోమ్‌లో జరిగిన మాటియో పెల్లికోన్ ర్యాంకింగ్ సిరీస్‌లో స్వర్ణం ♦2019లో యాసర్ డోగు ఇంటర్నేషనల్‌లో స్వర్ణం ♦2019లో వార్సాలో పోలాండ్ ఓపెన్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో స్వర్ణం ♦2020లో రోమ్ ర్యాంకింగ్ సిరీస్‌లో స్వర్ణం ♦2021లో కీవ్‌లో జరిగిన టోర్నమెంట్. మాటియో పెల్లికాన్ ర్యాంకింగ్ ♦సిరీస్‌లలో వరుసగా రెండు స్వర్ణాలు, 2021లో పోలాండ్ ఓపెన్‌లో స్వర్ణం

అవార్డులు: 2020లో మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు. ★ 2016లో అర్జున అవార్డు ★ 2022లో బిబిసి ఇండియన్ స్పోర్ట్స్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ ★ 2019లో లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డ్స్‌కు నామినేట్ అయిన తొలి ఇండియన్ అథ్లెట్.

తండ్రి శిక్షణతో బరిలో దిగిన సంగీతా ఫోగాట్

సంగీత ఫోగాట్ 1998 మార్చి 5న రెజ్లింగ్ మాస్ట్రో, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, మహావీర్ సింగ్ ఫోగట్, దయా శోభా కౌర్‌లకు హర్యానాలోని బలాలీలో జన్మించారు. ఆమెకు ముగ్గురు అక్కలు (గీత, బబిత, రీతు), ఒక తమ్ముడు దుష్యంత్ ఉన్నారు. చిన్నాన్న కుమార్తెలు వినేష్, ప్రియాంక. మగ వారికే కుస్తీ అని అనుకుంటున్న ఆ రోజుల్లో అందరినీ ఎదిరించి తన, సోదరుడి కుమార్తెలు మొత్తం ఆరుగురికి మహావీర్‌సింగ్ తన స్వగ్రామమైన బలాలీలో రెజ్లింగ్‌లో శిక్షణ ఇచ్చారు. సంగీత భర్త బజరంగ్ పునియా.

సాధించిన పతకాలు: జాతీయ ఛాంపియన్‌షిప్‌లో రజతం ♦2018 కామ న్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం ♦2017 నేషనల్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్‌లో స్వర్ణం ♦2013 జూనియర్ ఆసియా ఛాంపి యన్‌షిప్‌లో రజతం **అవార్డులు :** 2021లో అర్జున అవార్డు.

తాతయ్య ప్రేరణతో పతకాల పంట పండించిన సాక్షి మాలిక్

సాక్షి మాలిక్ 1992 సెప్టెంబర్ 3న హర్యానాలోని రోహ్‌తక్ జిల్లాలోని మోఖ్రా గ్రామంలో జన్మించారు. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో బస్ కండక్టర్ సుఖ్‌బీర్, స్థానిక ఆరోగ్య క్లినిక్‌లో సూపర్‌వైజర్ సుదేష్ మాలిక్ దంపతులకు జన్మించారు. మల్లయోధుడైన తన తాత బద్లు రామ్ ప్రేరణగా రెజ్లింగ్‌లో అడుగుపెట్టారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆమె భర్త అంతర్జాతీయ స్థాయి రెజ్లర్ సత్యవర్త్ కడియన్.

పతకాలు : 2012 ఆసియా జూనియర్ ఛాంపియన్ షిప్‌లో స్వర్ణం, 2009లో కాంస్యం, 2010లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ లో రజతం ♦2016లో రియో డిజనీరోలో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో కాంస్యం ♦కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో 2017లో స్వర్ణం, 2013లో రజతం ♦ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో 2017లో రజతం, 2015, 2018, 2019లో కాంస్యం ♦కామన్వెల్త్ గేమ్స్‌లో 2022లో స్వర్ణం, 2014లో రజతం, 2018లో కాంస్యం ♦2014లో డేవ్ షుల్ట్జ్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో స్వర్ణం

అవార్డులు: 2017లో పద్మశ్రీ, 2016లో మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న

నగదు పురస్కారాలు: ఇండియన్ రైల్వే, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఢిల్లీ ప్రభుత్వం, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌తో సహా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.5.7 కోట్ల కంటే ఎక్కువ నగదు బహుమతులు పొందారు. హర్యానా ప్రభుత్వం క్లాస్ 2 జాబ్ ఆఫర్ చేసింది. 500 చదరపు గజాల భూమి ఇచ్చింది.

సూ(ర్యా)పర్ సెంచరీ

రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన వృధా
గుజరాత్‌పై ముంబయి ఇండియన్స్ 28 పరుగుల తేడాతో గెలుపు

సూర్యకుమార్ యాదవ్
(103నాటౌట్)
(49 బంతుల్లో 11ఫోర్లు, 6సిక్సర్లు)

ముంబయి: ఐపిఎల్ సీజన్–16లో సూర్యకుమార్ యాదవ్ సూపర్ సెంచరీతో మెరవడంతో ముంబయి ఇండియన్స్ 28 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. తొలి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 218పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో గుజరాత్ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 8 వికెట్లు కోల్పోయి 191 పరుగులే చేసింది. ఈ గెలుపుతో ముంబయి జట్టు పాయింట్ల పట్టికలో 3వ స్థానానికి ఎగబాకి ప్లే–ఆఫ్‌కు చేరువైంది. వాంఖడే స్టేడియంలో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయికి సూర్యకుమార్ యాదవ్(103నాటౌట్) అజేయ శతకంతో రాణించడంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 218పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. సూర్యకుమార్ షాట్ కొడితే... బంతి వెళ్లి బౌండరీ దాటడం పరిపాటిగా మారింది. టాస్ గెలిచిన గుజరాత్... ముంబయికి బ్యాటింగ్ అప్పగించింది. సూర్య 49 బంతుల్లో 11ఫోర్లు, 6భారీ సిక్సర్లతో 103 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి ముందు సూర్య వ్యక్తిగత స్కోరు 97 పరుగులు కాగా... ఓ సిక్స్‌తో సెంచరీ అందుకున్న తీరు "వాహ్ సూర్యా వాహ్" అనిపించింది. ఈ సీజన్‌లో సూర్యకుమార్ ఇదే తొలి సెంచరీ. ఇషాన్ కిషన్ 31, కెప్టెన్ రోహిత్ శర్మ 29, నేహాల్ వధేరా 15, విష్ణు వినోద్ 30 పరుగులతో రాణించారు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్‌కు నాలుగు, మోహిత్ శర్మకు ఒక వికెట్ దక్కాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ జట్టు ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. విజయ్ శంకర్ (29), డేవిడ్ మిల్లర్(41)కి తోడు చివర్లో రషీద్‌ఖాన్ (79నాటౌట్; 32బంతుల్లో 3ఫోర్లు, 10సిక్సర్లు) మెరుపులు తోడైనా లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. మధ్వల్‌కు మూడు, చావ్లా, కార్తికేయకు రెండేసి వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు..

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్‌బి) రషీద్ ఖాన్ 31, రోహిత్ (సి)తెవాటియా (బి)రషీద్ ఖాన్ 29, సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 103, వధేరా (బి)రషీద్ ఖాన్ 15, విష్ణు వినోద్ (సి)మనోహర్ (బి)మోహిత్ శర్మ 30, టిమ్ డేవిడ్ (సి అండ్ బి)రషీద్ ఖాన్ 5, గ్రీన్ (నాటౌట్) 3, అదనం 2. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 218పరుగులు. **బౌలింగ్:** షమీ 4-0-53-0, మోహిత్ 4-0-43-1, రషీద్ 4-0-30-4, నూర్ 4-0-38-0, జోసెఫ్ 4-0-52-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (ఎల్‌బి)మధ్వాల్ 2, శుభ్‌మన్ (బి)మధ్వాల్ 6, హార్దిక్ (సి)ఇషాన్ (బి)బెహ్రెన్‌డార్ఫ్ 4, విజయ్ శంకర్ (బి)చావ్లా 29, డేవిడ్ మిల్లర్ (ఎల్‌బి) మధ్వాల్ 41, మనోహర్ (బి)కార్తికేయ 2, తెవాటియా (సి)గ్రీన్ (బి)చావ్లా 14, రషీద్ ఖాన్(79నాటౌట్), నూర్ అహ్మద్ (బి)కార్తికేయ 1, జోసెఫ్ (నాటౌట్) 7, అదనం 6. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 191పరుగులు. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 4-0-37-1, మధ్వాల్ 4-0-31-3, జోర్డాన్ 4-0-34-0, పియూష్ చావ్లా 4-0-36-2, కార్తికేయ 3-0-37-2, గ్రీన్ 1-0-13-0.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	12	8	4	0	16	+0.76
చెన్నై	12	7	4	1	15	+0.49
ముంబయి	12	7	5	0	14	-0.11
రాజస్తాన్	12	6	6	0	12	+0.63
లక్నో	11	5	5	1	11	+0.29
బెంగళూరు	11	5	6	0	10	-0.34
కోల్‌కతా	12	5	7	0	10	-0.35
పంజాబ్	11	5	6	0	10	-0.44
హైదరాబాద్	10	4	6	0	8	-0.47
ఢిల్లీ	11	4	7	0	8	-0.60

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు..

హైదరాబాద్ × లక్నో
(వేదిక: హైదరాబాద్; రా.3.30గం॥లకు)
ఢిల్లీ × పంజాబ్
(వేదిక: ఢిల్లీ, రా.7.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68